ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
శుక్రవారం 15 నవంబరు 2024

వైసీపీ పాపాలు..!

అవసరం లేకున్నా గోదాముల నిర్మాణం

- నాబార్డు నుంచి రుణం తెచ్చి మరీ పనులు
- గ్రామాలకు దూరంగా ఏర్పాటు
- రూ.లక్షలు వెచ్చించినా నిరుపయోగం
- రుణం చెల్లించలేక సొసైటీల తిప్పలు
- అయోమయంలో అధికారులు



ముత్యాలచెరువు వద్ద నిరుపయోగంగా ఉన్న గోదాము

కదిరి అర్బన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): అస్మదీయ కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చేలా గత వైసీపీ ప్రభుత్వం పాపాలు చేసింది. అవసరం లేకున్నా, అధికారులు వద్దంటున్నా వినకుండా ముందుకెళ్లింది. నాబార్డు నుంచి రుణం తీసుకుని మరీ.. జిల్లాలో మల్టీపర్పస్ ఫెసిలిటీస్ సర్వీస్ సెంటర్ల (ఎంపీఎ్‌ఫసీ) పేరులో గోదాముల నిర్మాణాలు చేపట్టింది. అడ్డగోలుగా వ్యవహరించింది. ఊరికి దూరంగా, అనువుగానిచోట గోదాములు నిర్మించింది. వాటి అవసరమే లేకపోవడంతో నిరుపయోగంగా పడి ఉన్నాయి. నాసిరకంగా నిర్మాణాలు చేపట్టడంతో ఎప్పుడైనా కూలిపోవచ్చని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాటి నిర్మాణానికి నాబార్డు నుంచి తీసుకున్న రుణాలను చెల్లించే భారం వ్యవసాయ సహకార పరపతి సంఘా (సొసైటీ)లపై మోపారు. వాటిని చెల్లించలేక సొసైటీలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. రుణాలు చెల్లించాలని నాబార్డు నుంచి ఒత్తిళ్లు అధికమవడంతో సొసైటీలకు చెప్పకుండా ఏడీసీసీ బ్యాంకు నేరుగా వడ్డీలు కడుతోంది. రైతులకు చెల్లించాల్సిన డివిడెండ్ సొమ్మును బ్యాంకు నాబార్డు రుణం వడ్డీకి జమ చేస్తుండడం పట్ల సొసైటీల అధ్యక్షులు, సీఈఓలు ఆందోళన చెందుతున్నారు. రైతులకు డబ్బు ఎలా చెల్లించాలని వాపోతున్నారు. విచిత్రమేమిటంటే నాబార్డు రుణాలు కాజేసి, కాంట్రాక్టర్లకు పూర్తిస్థాయిలో బిల్లులు చెల్లించకపోవడంతో కొన్నింటి నిర్మాణాలను అర్ధంతరంగా ఆపేశారు. మరికొన్ని పూర్తయినా బిల్లులు అందలేని కాంట్రాక్టర్లు తాళాలు స్వాధీనం చేయలేదు. కానీ, సొసైటీలు మాత్రం నాబార్డుకు రుణం వడ్డీ చెల్లించాల్సి వస్తోంది.

అధికారులు వద్దన్నా..

ఆహార ధాన్యాలు, నిత్యావసర వస్తువులను నిలువ చేసుకునేందుకని జిల్లాలో వంద గోదాముల నిర్మాణానికి గత వైసీపీ ప్రభుత్వం నాబార్డు నుంచి రుణం తీసుకుంది. దానిని వాటి పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు చెల్లించాలి. గోదాము అవసరమా, అనవసరమా అన్న విషయం గురించి కూడా ఆలోచించలేదు. గ్రామాలకు అందుబాటులో నిర్మించాలన్న ఆలోచన కూడా చేయలేదు. జిల్లాలో 90కిపైగా గోదాములు నిర్మించాలని ప్రభుత్వం ప్రతిపాదించగా, అధికారులు అభ్యంతరం తెలిపారు. అన్ని గోదాములు నిర్మించాల్సిన అవసరం లేదని తేల్చారు. జిల్లాలో గతంలో నిర్మించిన గోదాములే ఖాళీగా ఉన్నాయనీ, కొత్తవి వద్దని చెప్పినా, వారి మాటలను గత ప్రభుత్వం పట్టించుకోలేదు. ఒక్కో గోదాము నిర్మాణానికి రూ.40లక్షలు చొప్పున నిధులు వెచ్చించింది. జిల్లాలో మొత్తం 92 గోదాముల నిర్మాణం చేపట్టారు. వాటిలో 58 నిర్మాణాలు పూర్తయ్యాయి. బిల్లులు చెల్లించకపోవడంతో మిగిలిన వాటి నిర్మాణాలను కాంట్రాక్టర్లు ఆపేశారు. నిర్మాణాలు పూర్తయిన వాటిలో కూడా 28 మాత్రమే సొసైటీలకు స్వాధీనం చేశారు. బిల్లులు అందకపోవడంతో మిగతా 30 గోదాముల తాళాలను కాంట్రాక్టర్లు.. సొసైటీలకు అప్పగించలేదు. దీంతో అవి ఏడాది గడిచినా నిరుపయోగంగా ఉన్నాయి.

నాణ్యతాప్రమాణాలు శూన్యం

గోదాముల నిర్మాణాలను 2022లో ప్రారంభించారు. కాంట్రాక్టర్లు ప్రభుత్వానికి అనుకూల వ్యక్తులే కావడంతో జిల్లా అధికారులు పట్టించుకోలేదన్న విమర్శలున్నాయి. వెరసి నారసిరంగా నిర్మాణాలు చేపట్టారన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. దీనిపై ప్రాథమిక సహకార సంఘాల ప్రతినిధులు అభ్యంతరం వ్యక్తం చేశారు. నాసిరకం నిర్మాణాల కారణంగా గోదాములు బలహీనంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తూ పలుమార్లు కాంట్రాక్టర్‌ను అప్రమత్తం చేశారు. అధికారం అండతో వారు వాటిని ఖాతరు చేయలేదని తెలుస్తోంది.

నిరుపయోగంగా గోదాములు

జిల్లావ్యాప్తంగా నిర్మించిన గోదాములు గ్రామాలకు దూరంగా ఉన్నాయి. ఇప్పటి వరకు పూర్తయిన గోదాములకు తాళాలు వేసి ఉండడం మినహా వినియోగంలోకి తీసుకురాలేదు. కొన్నిచోట్ల గోదాములకు వెళ్లడానికి రోడ్డు సౌకర్యం కూడా లేదు. అద్దెకిద్దామన్నా అవకాశం లేదు. గోదాములు ఎరువులు, పంట ఉత్పత్తులు నిలువ చేసుకోవడానికే పనికొస్తాయి. కొన్నిప్రాంతాల్లో కల్యాణ మండలాలకు అద్దెకిచ్చే ప్రయత్నాలు చూస్తున్నా అందుకు అనుగుణంగా కొన్నిమార్పులు చేయాల్సి ఉంది. అందుకు ఎవరూ ముందుకు రావడంలేదని తెలుస్తోంది. గోదాముల నుంచి రూపాయి ఆదాయం లేకున్నా.. వాటి నిర్మాణానికి తీసుకున్న రుణాలను మాత్రం సొసైటీలు చెల్లించాల్సి వస్తోందని వాటి ప్రతినిధి ఒకరు వాపోయారు. సొసైటీలు రుణాల కంతులు చెల్లించకపోవడంతో నాబార్డు నుంచి ఒత్తిళ్లు అధికమయ్యాయి. దీంతో ఏడీసీసీ బ్యాంకు యాజమాన్యం.. సొసైటీలకు చెప్పకుండానే నాబార్డు రుణాలకు వడ్డీలు చెల్లిస్తూ కాలం గడుపుతోంది. వాస్తవానికి సొసైటీలు.. రైతులకు రుణాలిస్తాయి. వాటి వడ్డీ ద్వారా వచ్చే ఆదాయాన్ని మళ్లీ రైతులకే పంచాలి. అలా పంచాల్సిన సొమ్మును ఏడీసీసీ బ్యాంకు యాజమాన్యం మాట మాత్రం కూడా చెప్పకుండా నాబార్డు రుణాల వడ్డీలకు జమ చేస్తోందని సొసైటీల అధ్యక్షులు, సీఈఓలు వాపోతున్నారు. రైతులు అడిగితే తాము ఎక్కడి నుంచి తేవాలని ఆవేదన చెందుతున్నారు.

మందుబాబులకు అడ్డాలుగా..

రూ.లక్షలు వెచ్చించి గ్రామాలకు దూరంగా గోదాములు నిర్మించడంతో అవి నిరుపయోగంగా మారాయి. మందుబాబులు అడ్డాలుగా చేసుకున్నారు. నిర్మానుష్య ప్రదేశం కావడంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలయ్యాయి. గోదాముల్లో మద్యం బాటిళ్లు, వాటర్ ప్యాకెట్లు దర్శనమిస్తుండడమే ఇందుకు నిదర్శనం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, ఈ గోదాములను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

ఆదాయం తెచ్చే మార్గాలను అన్వేషిస్తున్నాం..

ఆయా సొసైటీల పరిధిలో నిర్మించిన గోదాములు నిరుపయోగంగా ఉన్నాయి. ఆదాయం లేకపోవడంతో కంతులు చెల్లించడం భారంగా మారింది. దీంతో ఆదాయం వచ్చేలా ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషిస్తున్నాం. ప్రభుత్వ, ప్రైవేటు ఏజెన్సీలు కావాలంటే అద్దెకు ఉపయోగించుకోవచ్చు. అందుకు సిద్ధంగా ఉన్నాం.

\- కృష్ణానాయక్, జిల్లా సహకార అధికారి



విజేత విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ఆర్డీఓ సువర్ణ

ఘనంగా బాలల దినోత్సవం

పుట్టపర్తిరూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): దేశ తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని గురువారం జిల్లావ్యాప్తంగా బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు పోటీలు పెట్టి, విజేతలకు బహుమతులు అందజేశారు. పుట్టపర్తి మండలంలోని బీడుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా బాలల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఘనంగా బాలల దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్డీఓ పొడపాటి సువర్ణ.. జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డీఈఓ కిష్టప్ప, ఐసీడీఎస్ పీడీ వరలక్ష్మి, డీసీపీఓ మహేష్, సీఐ ఇందిర, డీఐఈఓ రంగస్వామి పాల్గొన్నారు.



హిందూపురంలోని పాంచజన్య పాఠశాలలో సంబరాలు

నలుగురికి కార్పొరేషన్ డైరెక్టర్ పదవులు



ఆనంద్‌కుమార్



డీవీ ఆంజనేయులు



గంగాధరప్ప

పుట్టపర్తి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన నలుగురు టీడీపీ నాయకులను రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ పదవులు వరించాయి. వాల్మీకి, బోయ సంక్షేమ, అభివృద్ధి రాష్ట్ర కార్పొరేషన్‌లో జిల్లా నుంచి ముగ్గురికి స్థానం కల్పించారు. కూటమి ప్రభుత్వం గురువారం పలు రాష్ట్ర సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్లకు డైరెక్టర్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. వాల్మీకి, బోయ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్లుగా టీడీపీ నుంచి ముగ్గురికి స్థానం లభించింది. హిందూపురం నుంచి బేవనహళ్లి ఆనంద్‌కుమార్, పెనుకొండ నియోజకవర్గం నుంచి సోమందేపల్లికి చెందిన డీవీ ఆంజనేయులు, పుట్టపర్తి నియోజకవర్గం నుంచి రామాంజనేయులును నియమించారు. మాదిగ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా హిందూపురం నియోజకవర్గం చిలమత్తూరు మండలం కోడూరుకు చెందిన టీడీపీ నాయకుడు సడ్లపల్లి గంగాధరప్పను నియమించారు.

ఆగని వైసీపీ ఆగడాలు

అనుచరుల కోసం పోలీసు స్టేషన్‌కు శంకర్‌నారాయణ

స్టేషన్ బెయిల్‌తో విడిపించుకున్న వైనం

అన్యాయం చేశారంటూ టీడీపీ కార్యకర్త ఆత్మహత్యాయత్నం





శంకర్‌నారాయణతో వాగ్వాదం చేస్తున్న రంగప్ప, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు

హిందూపురం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మారినా కొంతమంది వైసీపీ నాయకుల ఆగడాలు మాత్రం ఆగలేదు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రౌడీయిజాన్ని ప్రదర్శించిన నాయకులు ఇప్పటికీ వారి తీరు మార్చుకోలేదు. ఈక్రమంలో తన ఇంటిపై వైసీపీ నాయకులు దాడి చేసి, ఫర్నీచర్ ధ్వంసం చేశారని టీడీపీ కార్యకర్త, మండలంలోని బూదిలివాండ్లపల్లికి చెందిన వడ్డె రంగప్ప పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈనెల 9న రాత్రి బుల్లెట్ బాబు, ఉగ్రహారంపల్లి శ్రీనివాసులు, మరొకరు బూదివారిపల్లికి వచ్చి వడ్డె రంగప్ప ఇంట్లోకి దౌర్జన్యంగా చొరబడ్డారు. టీవీతో పాటు మరికొన్ని వస్తువులను ధ్వంసం చేయడంతోపాటు తనపై, తన భార్యపై దాడి చేశారని గోరంట్ల పోలీసు స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు కేసు నమోదు చేశారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి శంకర్‌నారాయణ గురువారం గోరంట్ల పోలీసు స్టేషన్‌కు వచ్చారు. సీఐ శేఖర్‌తో మాట్లాడుతుండగా.. బాధితుడు రంగప్ప అక్కడికెళ్లారు. తన ఇంట్లోని వస్తువులను ధ్వంసం చేసి, తమపై దాడి చేసిన వారికి స్టేషన్ బెయిల్ ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. అక్కడే ఉన్న శంకర్‌నారాయణను నిలదీశారు. 'గతంలో నీకు ఎంతో చేశా. నీవల్ల, నీ అనుచరుల వల్ల కేసుల్లో కూడా ఇరుకున్నా. మీ అన్యాయాలు, అక్రమాలు చూడలేకనే పార్టీ మారా. అయినా మీ వక్రబుద్ధి పోనిచ్చుకోకుండా మాపై దాడి చేశారు' అని రంగప్ప ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో బుల్లెట్‌బాబు, శ్రీనివాసులు, శంకర్ రెడ్డి తనతో అనేక అక్రమాలు చేయించి, కేసుల్లో ఇరికించారని కన్నీరు పెట్టుకున్నారు. దీంతో మనస్తాపం చెందిన రంగప్ప స్టేషన్ బయటకు వచ్చి రోడ్డులో ఒంటిపై పెట్రోలు పోసుకుని, ఆత్మహత్యకు యత్నించారు. అప్రమత్తమైన పోలీసులు వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంలో స్టేషన్‌వద్ద కొంతసేపు గందరగోళం నెలకొంది. కేసులో నిందితులకు స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపారు. దౌర్జన్యపరులకు శంకర్‌నారాయణ మద్దతివ్వడం ఏంటని రంగప్ప వాపోయారు. దీనిపై సీఐ శేఖర్‌ను వివరణ కోరగా.. రంగప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఇందులో ఎలాంటి పక్షపాతం చూపలేదన్నారు.

ఫ్రీగా కొట్టేశారు..!

వందల కోట్ల అసైన్డ్ దందా

- జిల్లాలో ఫ్రీహోల్డ్‌లో సగం అక్రమమే
- నాలుగు దశల్లో రికార్డుల పరిశీలన
- తుదిదశకు ప్రక్రియ
- అక్రమార్కుల్లో దడ





ఫ్రీహోల్డ్ భూముల రికార్డులను పరిశీలిస్తున్న రెవెన్యూ బృందం (ఫైల్)

పుట్టపర్తి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ హయాంలో ఫ్రీహోల్డ్ (అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు) మాటున జిల్లాలో రూ.వందల కోట్ల విలువైన అసైన్డ్ భూదందా సాగింది. నిబంధనలు అతిక్రమించి ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. అక్రమాలకు వత్తాసు పలికిన రెవెన్యూ అధికారుల్లో దడ మొదలైంది. వైసీపీ పాలనలో నిషేధిత 22(ఏ) ఫ్రీహోల్డ్ రిజిస్ట్రేషన్ భూములపై సమగ్ర విచారణ తదిదశకు వచ్చింది. కొన్నిరోజుల క్రితం జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పుట్టపర్తికి వచ్చారు. జిల్లాలో ఫ్రీహోల్డ్ మాటున సాగించిన దందాపై త్రిసభ్య కమిటీ లోతుగా విచారణ చేపడుతున్నట్లు వెల్లడించారు. జిల్లాలో భారీఎత్తున అక్రమాలకు పాల్పడినట్లు మంత్రి తెలపడం చర్చనీయాంశమైంది. గత వైసీపీ ప్రభుత్వంలో జిల్లాలో 22(ఏ) ఫ్రీహోల్డ్‌పై రెవెన్యూ అధికారులు, వైసీపీ నేతలు కుమ్మక్కై విచ్చలవిడిగా చేశారన్న ఆరోపణలున్నాయి. రాష్ట్రంలోనే ఫ్రీహోల్డ్ పరంగా మూడోస్థానంలో జిల్లా నిలిచిందంటే దందా ఏస్థాయిలో సాగిందో అర్థం చేసుకోవచ్చు. అసైన్డ్ భూముల సాగుదారులకు శాశ్వత భూయాజమాన్య హక్కులు కల్పిస్తామంటూ గతేడాది డిసెంబరు 19న వైసీపీ ప్రభుత్వం జీఓ 569 జారీ చేసింది. కనీసం 20 ఏళ్లకుపైగా అనుభవంలో ఉన్న వారికి ఆ చట్టం వర్తిస్తుంది. ఇదే అదునుగా తీసుకుని ఆయా నియోజకవర్గాల్లో కీలక ప్రజాప్రతినిధులు, నేతలు భూకబ్జాదారుల అవతారమెత్తారు. అసైన్డ్, చుక్కల 22ఏ నిషేధిత దేవదాయ, వంక పోరంబోకు, పరిశ్రమలు, అటవీ ఇలా అనేక రూపాల్లో ఉన్న భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించి, ఫ్రీహోల్డ్ కల్పించారు. ఇలా జిల్లాలో 32 మండలాల్లో 1,92,329 ఎకరాల అసైన్డ్ భూములకు (ఫ్రీహోల్డ్) యాజమాన్య హక్కులు కల్పించారు. ఆరు నెలల్లో జిల్లాలోని తొమ్మిది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో నిషిద్ధ జాబితా భూముల 22(ఏ)తోపాటు ఫ్రీహోల్డ్ రిజిస్ట్రేషన్లు 5242.99 ఎకరాలు జరిగినట్లు లెక్కతేల్చారు. క్షేత్రస్థాయి విచారణలో 2.29 లక్షల ఎకరాలకు లెక్కతేలినట్లు తెలుస్తోంది.

యథేచ్ఛగా భూదోపిడీ

జిల్లాలో ఫ్రీహోల్డ్ మాటున వైసీపీ సాగించిన అసైన్డ్ భూముల దందా తెరపైకి వస్తోంది. ఫ్రీహోల్డ్ కల్పిస్తున్నట్లు ప్రభుత్వ పెద్దల ముందస్తు సమాచారంతో ఆయా నియోజకవర్గాల్లో ప్రజాప్రతినిధులు, వైసీపీ నేతలు, రియల్ మాఫియా.. పేదలు, మధ్యతరగతి వర్గాల అసైన్డ్ భూములపై కన్నేశారు. కారుచౌకగా వాటిని కొనేశారు. బెదిరించి, కొన్నింటిని లాక్కున్నారు. రికార్డులను మార్చి రూ.కోట్ల విలువచేసే భూములను ఫ్రీహోల్డ్ పేరుతో కారుచౌకగా కొట్టేశారు. వైసీపీ నేతలకు మేలుచేసేలా ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్ చేసేందుకు జీవో 596ను గతేడాది డిసెంబరులో తీసుకొచ్చారు. హడావుడిగా సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌దాకా వేలాది ఎకరాలు ఫ్రీహోల్డ్ చేసి భూములను రిజిస్ట్రేషన్లు చేయించారు. అప్పటి ప్రజాప్రతినిధులు, వైసీపీ నేతల సిఫార్సు చేసి కొందరికి భూముల రిజిస్ట్రేషన్ అవకాశం కల్పించారు. పనిలో పనిగా రెవెన్యూలో కొందరు బేరం పెట్టి, ఇష్టా రాజ్యంగా ఫ్రీహోల్డ్ చేశారు. ధర్మవరం, పెనుకొండ, చిలమత్తూరు, హిందూపురం, బుక్కపట్నం, చెన్నేకొత్తపల్లి, కదిరి, మడకశిర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో అత్యధికంగా 5242.99 ఎకరాల అసైన్డ్ భూములను ఫ్రీహోల్డ్ మాటున రిజిస్ట్రేషన్ చేశారు. వాటిలో అత్యధికంగా వైసీపీ నేతలతోపాటు ఆ పార్టీ అనుకూల స్థిరాస్తి వ్యాపారులు కొందరు.. బినామీల పేరుతో ముందస్తు అగ్రిమెంట్లు, కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. పెనుకొండ, ధర్మవరం, పుట్టపర్తి, కదిరి రెవెన్యూ డివిజన్లలోని అన్ని మండలాల్లో ఫ్రీహోల్డ్ అసైన్డ్ భూముల్లో అక్రమాల డొంక వెలుగుచూసినట్లు తెలుస్తోంది.

అక్రమార్కుల్లో దడ

గత వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్రీహోల్డ్ మాటున అత్యధికంగా రిజిస్ట్రేషన్లు చేసిన జిల్లాల్లో జిల్లా ఒకటి. రాష్ట్రవ్యాప్తంగా అడ్డగోలుగా సాగిన 22(ఏ) ఫ్రీహోల్డ్ చేసిన రిజిస్ట్రేషన్ చేసిన అసైన్డ్ భూములపై నిగ్గుతేల్చేందుకు కూటమి ప్రభుత్వం లోతైన విచారణకు ఆదేశించింది. ఆగస్టులో రెవెన్యూ శాఖ క్షేత్రస్థాయిలో ప్రాథమిక విచారణ చేపట్టిన సంగతి తెలిసిందే. నాలుగు దశల్లో మండలం, గ్రామం, సర్వే నంబరు, విస్తీర్ణం, భూమి స్వభావం, పట్టాదారు పేరు, ఖాతా నంబరు, ఆధార్‌కార్డు నంబరు సహా వివరాలు సమగ్రంగా అందించాలని ప్రభుత్వం కోరింది. అసైన్డ్ పట్టాదారు భూమినే ఫ్రీహోల్డ్ చేశారా.. అక్రమాలకు పాల్పడ్డారా తదితర వివరాలు అందించాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా 32 మండలాల్లో రెవెన్యూ యంత్రాంగం రికార్డుల ఆధారంగా క్షేత్రస్థాయి పరిశీలన మొదలు పెట్టింది. వీఆర్వోలు, డిప్యూటీ తహసీల్దార్లు, తహసీల్దార్లు, ఆర్డీఓలను దాటుకుని కలెక్టరేట్‌లో ప్రత్యేక బృందాలు రికార్డుల పరిశీలన చేపడుతున్నాయి. ఫ్రీహోల్డ్‌లో నిబంధనలు పాటించారా, 20 ఏళ్ల అనుభవాన్ని పరిగణనలోకి తీసుకున్నారా, తప్పుడు లెక్కలు, రికార్డులతో నిషేధిత జాబితా నుంచి తొలగించారా, భూముల రిజిస్ట్రేషన్ ఎలా సాగింది తదితర అంశాలను లోతుగా పరిశీలిస్తున్నారు. ఇప్పటిదాకా పరిశీలనలో జిల్లాలో పలుచోట్ల కొందరు వైసీపీ ప్రజాపతినిధులు, నేతలు సిఫార్సు చేసిన వారికి నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్, కలెక్టర్ ప్రొసీడింగ్స్ లేకుండానే వందలాది ఎకరాల భూములకు ఫ్రీహోల్డ్ చేసినట్లు విచారణలో గుర్తించినట్లు తెలుస్తోంది. నిబంధనలు అతిక్రమించి వైసీపీ నేతలు ముందస్తుగా కొనుగోళ్లతో కారుచౌకగా భూములు కొట్టేశారని అధికారుల పరిశీలనలో స్పష్టమైంది. వైసీపీ నేతలు, అప్పటి రెవెన్యూ అధికారులు కుమ్మక్కై ఫ్రీహోల్డ్ భూముల వ్యవహారంలో భారీగా దోపిడీకి పాల్పడినట్లు తేలినట్లు తెలుస్తోంది. జిల్లా వ్యాప్తంగా 1.15 లక్షల ఎకరాల్లో అక్రమాలు జరిగినట్లు స్వయానా రెవెన్యూ శాఖ మంత్రే వెల్లడించడం గమనార్హం. నాలుగు దశల్లో విచారణ పూర్తి చేసి, సమగ్ర వివరాలతో రాష్ట్ర భూపరిపాలన కమిషనర్ (సీసీఎల్‌ఏ)కు నివేదిస్తున్న నేపథ్యంలో అక్రమాల్లో కీలక పాత్ర పోషించిన రెవెన్యూ అధికారులపై శాఖాపరమైన చర్యలు తప్పవన్న సంకేతాలు వెలువడుతున్నాయి.



పరిమళించిన పసివారు

మట్టి.. రంగులతో కళాఖండాలు

ఆర్డీటీ ఆర్ట్ ఫెస్టివల్‌లో అద్భుతాలు



వెన్నుతట్టి ప్రోత్సహించాలేగానీ.. ఆకాశంలోని నక్షత్రాలను నేలపై ఆవిష్కరించగలరు. బంక మట్టితో భగవంతుడినే సృష్టించగలరు. సంస్కృతి, సంప్రదాయాలను కళ్లకు కట్టగలరు. అకృత్యాలకు వ్యతిరేకంగా కళల గళాన్ని వినిపించగలరు. అందరూ పసివారే..! అద్భుతమైన ప్రతిభ ఉన్నవారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని అనంతపురం నగరంలోని ఆర్డీటీ ప్రధాన కార్యాలయంలో గురువారం ఆర్ట్ ఫెస్టివల్ నిర్వహించారు. అక్కడికి వచ్చిన వందలాది మంది పసివారు పరిమళించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అద్భుతాలను ఆవిష్కరించారు. రంగోలి, చేతిరాత, న్యాచురల్ కొలేజ్, పిక్చర్ పెయింటింగ్, క్లే మోడల్, ఒరిగామి ఆర్ట్‌వర్క్.. ఇలా ఆరు విభాగాలలో పోటీ పడ్డారు. కర్నూలు, అనంత ఉమ్మడి జిల్లాలోని 37 ప్రాంతాల నుంచి 222 మంది ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఒకరికి ఒకరు ఏమాత్రం తీసిపోరు. అందులో కొందరి ఆవిష్కరణలు ఇవి.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం కల్చరల్

వెన్నదొంగ.. గోవర్ధనుడు



గొల్లపల్లి తండాకు చెందిన రవినాయక్, పేరమ్మ దంపతుల కుమారుడు గోవర్ధన్ అదే తండా ప్రభుత్వ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. పాఠశాల ముగిసిన తర్వాత రోజూ సాయంత్రం లక్ష్మన్న అనే ట్యూషన్ మాస్టర్ వద్దకు వెళుతుంటాడు. లక్ష్మన్న చదువు చెప్పడంతోపాటు మట్టితో బొమ్మలు తయారు చేయడం నేర్పించేవాడు. ఆ కళను పోటీలో ప్రదర్శించాడు గోవర్ధన్..! స్వామి పేరు పెట్టుకున్నందుకో ఏమో.. వెన్న దొంగ ప్రతిమను అందంగా తీర్చిదిద్దాడు. దీనికోసం 12 రోజులపాటు ప్రాక్టీస్ చేశాడట.

కళ్లెదుట అరణ్యకాండ: సంతోష్‌కుమార్



రావణుడు సీతను అపహరించుకుని వెళ్తున్నపుడు జటాయువు వీరోచితంగా పోరాడి రెక్కలు కోల్పోతుంది. సీతాపహరణ విషయాన్ని శ్రీరాముడికి వివరించి ప్రాణాలు విడుస్తుంది. ఈ ఘట్టాన్ని తన కళతో కళ్లకు కట్టాడు సంతోష్ కుమార్. కణేకల్లు మండలం కురువళ్లి గ్రామానికి చెందిన సురేష్, నాగరత్నమ్మ దంపతుల కుమారుడు. అదేగ్రామంలోని ఎంపీపీ స్కూల్‌లో ఐదో తరగతి చదువుతున్నాడు. దాదాపు నెలరోజులపాటు బంకమట్టితో బొమ్మలు తయారు చేయడం నేర్చుకుని, ఆర్ట్ ఫెస్టివల్‌లో క్లేమోడల్ విభాగంలో ఎంతో సుందరంగా అరణ్యకాండ ఘట్టాన్ని ఆవిష్కరించాడు.

మహిళలపై అఘాయిత్యాలు వద్దు: అమర్‌నాథ్



మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టాలని బొమ్మలతో చెప్పించాడు అమర్నాథ్. గుంతకల్లు మండలం వైటీ చెరువుకు చెందిన రామాంజనేయులు, సువర్ధమ్మ కుమారుడు. స్థానిక ప్రభుత్వ బాలుర పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాల నిర్మూలన అంశాన్ని ఎంచుకుని.. ఉపాధ్యాయుల వద్ద వారంరోజులపాటు శిక్షణ పొందాడు. మట్టి బొమ్మలతో మహిళలకు మద్దతుగా నినదించాడు.

విద్యార్థులు అన్ని విషయాలనూ తెలుసుకోవాలి..



విద్యార్థిదశలోనే మన మాతృదేశంలోని అన్ని అంశాల గురించి తెలుసుకోవాలి. అదే ధ్యేయంతో పాఠాలను చెబుతుంటాం. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని వరుణ్‌కు సైగలద్వారానే శిక్షణ ఇచ్చాను. దేశంలోని వివిధ అంశాలను రంగవల్లికలలో చూపించేలా తీర్చిదిద్దాము.

- వాణిశ్రీ, ఉపాధ్యాయిని

చదువే... సారాంశం...



నేటితరం విద్యార్థులు టీవీ, సెల్‌ఫోన్ వంటి పరికరాలపై ఎక్కువగా ఆసక్తి కనబరుస్తున్నారు. సెల్‌ఫోన్ మనకు అవసరమే అయినా.. కేవలం ఒక వస్తువుగానే భావించాలి. చదువు పట్ల మొగ్గుచూపాలనే ఈ అంశాన్ని ఎంచుకుని అక్షయ్‌కు శిక్షణ ఇచ్చాను.

- శ్రీనివాస్, ఆర్డీటీ సమ్మిళిత పాఠశాల, కూడేరు

సైగలతోనే శిక్షణ...



బధిర, మూగ పిల్లలకు శిక్షణ ఇవ్వడం నైపుణ్యంతో కూడుకున్న పని. వారికి సైగలతో మాత్రమే బోధించాలి. మా పాఠశాలలోని బధిర, మూగ విద్యార్థులు సైతం సాధారణ విద్యార్థులతో కలిసి అన్నిరకాల యాక్టివిటీస్‌లో పాల్గొనేలా ప్రోత్సహిస్తున్నాం. ఈ క్రమంలోనే ఆర్ట్ ఫెస్టివల్‌లో పాల్గొనేలా శిక్షణ ఇచ్చి తీసుకొచ్చాం.

- మారెన్న, ఉపాధ్యాయుడు, కూడేరు

రంగు రంగుల పురోగతి: వరుణ్



కూడేరుకు చెందిన శ్రీకాంత్, అంజనావతి దంపతుల కుమారుడు వరుణ్ దేశ పురోగతిని రంగు రంగుల రంగవల్లికలతో కళ్లకు కట్టాడు. చిన్నతనంలోనే తల్లిని కోల్పోయాడు. తండ్రి శ్రీకాంత్ హోటల్‌లో పనిచేస్తుంటాడు. కూడేరులోని ఆర్డీటీ సమ్మిళిత పాఠశాలలో వరుణ్ నాలుగో తరగతి చదువుతున్నాడు. పుట్టుకతోనే మూగ, బధిరుడు. వాణిశ్రీ అనే ఉపాధ్యాయిని వరుణ్‌కు 15 రోజులపాటు శిక్షణ ఇచ్చారు. ఒలింపిక్స్, కొవిడ్‌కి ఎదురొడ్డి నిలబడడం, భారతీయ సంస్కృతి, ఇస్రో, మేక్ ఇన్ ఇండియా, తదితరాలను రంగవల్లికలతో ఆవిష్కరించాడు వరుణ్.

ఫోన్ వద్దు... పుస్తకం పట్టు: అక్షయ్



సెల్‌ఫోన్ వినియోగం కన్నా పుస్తక పఠనమే మానవాళికి ప్రయోజనకరమని తన కళతో ప్రదర్శించాడు అక్షయ్. కూడేరుకు చెందిన కుమార్, అనిత దంపతుల కుమారుడు అక్షయ్.. స్థానిక ఆర్డీటీ సమ్మిళిత పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. పాఠశాలలో శ్రీనివాస్ అనే ఉపాధ్యాయుడి సమక్షంలో పది రోజులుగా బంకమట్టితో బొమ్మలు తయారు చేయడం నేర్చుకున్నాడు. సెల్‌ఫోన్ వల్ల కలిగే అనర్థాలు, పుస్తకాల వల్ల కలిగే ప్రయోజనాన్ని వివరిస్తూ బొమ్మను రూపొందించి ప్రదర్శించాడు.

రైతు బిడ్డలు.. భిన్న ధ్రువాలు: సురేష్



ఒకే తల్లి కడుపున పుట్టారు. ఇద్దరూ భూమినే నమ్ముకున్నారు. కానీ.. వినియోగంలో భిన్నత్వం చూపించారు. ఒకరి భూమిలో గాలి మరలు.. మరొకరి భూమిలో పచ్చటి పొలాలను ఆవిష్కరించాడు సురేష్. కూడేరుకు చెందిన గంగమ్మ, ఎర్రిస్వామి దంపతుల కుమారుడు. వీరు వ్యవసాయం చేస్తుంటారు. సురేష్‌కు పుట్టుకతోనే వినికిడి సమస్య ఏర్పడింది. దీంతో మాటలు రాకుండాపోయాయి. కూడేరు ఆర్డీటీ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. మారెన్న అనే ఉపాధ్యాయుడు సైగల ద్వారానే చదువు నేర్పుతున్నారు. దీంతోపాటు మట్టి బొమ్మల తయారీనీ నేర్పిస్తున్నాడు. ఈ అంశాన్ని 12 రోజులపాటు నేర్చుకున్న సురేష్.. రైతు సోదరులను పొలంలో అద్భుతంగా ఆవిష్కరించాడు.



మట్టితో కళాఖండాలను తయారు చేస్తున్న చిన్నారులు

రేవతి.. ప్రకృతి



కొండల నడుమ నుంచి చెక్‌డ్యామ్‌కు చేరిన వర్షపునీరు.. అటు నుంచి బ్రిడ్జిల కింద కాలువల ద్వారా పొలాలకు చేరే నీరు. ఆ నీటితో పంటపొలాల సాగు.. ఇలా ప్రకృతి సౌందర్యాన్ని ఆవిష్కరించింది రేవతి. పామిడి మండలం ఎద్దులపల్లికి చెందిన నాగరాజు, ఆదిలక్ష్మి దంపతుల కూతురు. నాగరాజు ఆటోడ్రైవర్‌గా పనిచేస్తుండగా ఆదిలక్ష్మి ఇళ్లలో పనిచేస్తుంటారు. అదే గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్‌లో రేవతి ఐదో తరగతి చదువుతోంది. ఈ కళను ప్రదర్శించేందుకు 25 రోజులపాటు ప్రాక్టీస్ చేసింది. చుట్టుపక్కల లభించే అరంటు, దుబాయి కాయలు, గవ్వలు, కుసుములు, బీన్స్, చింతపిచ్చులు, గద్దముక్కుకాయలు, చెండుపూలతో ప్రకృతి రమణీయతను కళ్లకు కట్టింది.

ప్రజ్వల్.. జోడు లింగాలు



కూడేరులోని సంగమేశ్వరం జోడు లింగాల ఆలయం ప్రఖ్యాతి గాంచింది. ఆర్డీటీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ఆర్ట్ ఫెస్టివల్‌కు జోడులింగాలు కదిలొచ్చాయి. అండేపల్లికి చెందిన రాజు, మంజుల దంపతుల కుమారుడు ప్రజ్వల్.. వీటిని మట్టితో ఆవిష్కరించాడు. కూడేరు ఆర్డీటీ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. చిన్నపుడే తల్లిదండ్రులిద్దరు చనిపోయారు. అవ్వాతాతలు కర్రమ్మ, నాగప్ప వద్ద ఉంటూ బడికి వెళుతున్నాడు. వారంరోజులపాటు ప్రాక్టీస్ చేసి ఆర్ట్ ఫెస్టివల్‌లో మొక్కల కాండాలు, అరటి బెరడు, రాళ్లతో జోడులింగాల నమూనాను తీర్చిదిద్దాడు.

రంగవల్లికలో శ్రీనివాసుడు: సుదర్శిని





ఆర్ట్ ఫెస్టివల్ రంగవల్లుల విభాగంలో కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వర స్వామిని ఆవిష్కరించింది చిన్నారి సుదర్శిని. కురువళ్లి గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ మర్రిస్వామి, రైతుకూలీ శ్రీదేవి దంపతుల కూతురు తను. అదే గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో ఐదో తరగతి చదువుతోంది. సుదర్శినికి రంగవల్లులపై ఆసక్తి ఎక్కువ. అందుకే ఇదే విభాగంలో స్వామివారిని తీర్చిదిద్దింది.

మహిళల భద్రత: ప్రవీణ్



మహిళల భద్రత ఇతివృత్తంగా రంగవల్లులను తీర్చిదిద్దాడు ప్రవీణ్. అనంతపురం అంబేడ్కర్ నగర్‌కు చెందిన మల్లేశ్వరి, శ్రీనివాసులు దంపతుల కుమారుడు. మల్లేశ్వరి ఓ హోటల్‌లో పనిచేస్తోంది. శ్రీనివాసులు కొన్నేళ్ల క్రితం చనిపోయారు. ప్రవీణ్ ఆర్డీటీ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను గురించి ఉపాధ్యాయులద్వారా తెలుసుకుని, వారికి భద్రత కల్పించాలనే అంశాన్ని రంగవల్లిక ద్వారా చూపించాడు. అత్యాచారాలు, చులకన భావం, వరకట్న వేధింపులు, యాసిడ్ దాడులు, హత్యలను నివారించాలని రంగవల్లికల ద్వారా డిమాండ్ చేశాడు ప్రవీణ్.

సహకార వ్యవస్థను బలోపేతం చేయాలి

జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత నిర్మాణంలో సహకార సొసైటీ పాత్ర ప్రాముఖ్యతను చాటుకుంటున్నాయని ఏడీసీసీ బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి, జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ అన్నారు. 71వ అఖిల భారత సహకార వారోత్సవాలను గురువారం స్థానిక ఎన్టీఆర్ సహకారభవన్‌లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 20వతేదీ వరకు వారోత్సవాలు జరగనున్నాయన్నారు. జిల్లాలో సహకార వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సూచించారు. జిల్లా సహకారశాఖ అధికారి (డీసీఓ) అరుణకుమారి, ఏడీసీసీ బ్యాంకు సీఈఓ సురేఖరాణి మాట్లాడుతూ సహకార వ్యవస్థను బలోపేతం చేయడంలో భాగంగానే సొసైటీల కంప్యూటరైజేషన్, గోడౌన్ల నిర్మాణం-నిర్వహణ, పెట్రోలు బంకులు ఏర్పాటు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో డీఎల్‌సీఓ ప్రభాకర్‌రెడ్డి, జిల్లా సహకార విద్యాధికారి మురళీ మోహన్, సబ్‌డివిజనల్ అధికారి బాలగంగాధర్ పాల్గొన్నారు.

సంతోష్ ట్రోఫీని విజయవంతం చేయాలి

: కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సంతోష్ ట్రోఫీని విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. సంతోష్‌ట్రోఫీని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. గురువారం నుంచి 19వతేదీ వరకు ఆర్డీటీ స్టేడియంలో ట్రోఫీ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డేనియల్ ప్రదీప్ మాట్లాడుతూ.. జిల్లాలో ఫుట్‌బాల్ అభివృద్ధికి, క్రీడాకారుల ప్రోత్సాహానికి ఎంతో దోహదం చేస్తుందన్నారు. టోర్నీలో ఏపీ, తమిళనాడు, అండమాన్ నికోబార్ దీవులు, కర్ణాటక రాష్ట్రాల జట్లు ప్రాతినిథ్యం వహిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

డబ్బులు ఇవ్వం.. భూములనూ ఇవ్వం

మాజీ మంత్రి రాయబారం.. తిప్పికొడుతున్న రైతులు

సోలార్ భూముల కోసం గతంలో భారీగా అగ్రిమెంట్లు

కళ్యాణదుర్గం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): వైసీపీ తిరిగి అధికారంలోకి వస్తుందని, సోలార్ కంపెనీలకు భూములను అమ్మి సొమ్ము చేసుకోవాలని భావించిన మాజీ మంత్రి ఉష శ్రీచరణ్‌కు చుక్కెదురైంది. అగ్రిమెంట్లు చేసుకున్న రైతులు అడ్వాన్సుగా తీసుకున్న సొమ్మును తిరిగి ఇవ్వడానికి నిరాకరిస్తున్నారు. దీంతో ఆమె దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్నారు. వైసీపీ హయాంలో సోలార్ ప్లాంట్ ఏర్పాటు కోసం కళ్యాణదుర్గం నియోజకవర్గంలో సుమారు 300 ఎకరాల భూముల కొనుగోలుకు మాజీ మంత్రి ఒప్పందం చేసుకున్నారు. కంబదూరు మండలం మర్రిమాకులపల్లి, ములకనూరు, కుందుర్పి మండలం, కళ్యాణదుర్గం మండలం, మరికొన్ని గ్రామాల్లో రైతులతో అగ్రిమెంట్ రాయించుకున్నారు. ఒక్కొక్క రైతుకు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలదాకా చెల్లించారు. తక్కువ ధరకే భూములను ఇవ్వాలని అప్పట్లో రైతులపై ఉష శ్రీచరణ్, ఆమె అనుచరవర్గం బెదిరించింది. వైసీపీ ఘోర పరాజయంతో ఇప్పుడు వారి పప్పులు ఉడకడం లేదు. ఉషశ్రీచరణ్ కళ్యాణదుర్గం నియోజకవర్గం నుంచి వెళ్లిపోయారు. కొన్ని నెలల పాటు ఈ భూముల గురించి ఎవరూ పట్టించుకోలేదు. రైతులు కూడా మిన్నకుండిపోయారు. అయితే వారం రోజుల నుంచి ఉష శ్రీచరణ్ అనుచరవర్గం రైతులతో రాయబారాలు నడుపుతోంది. అగ్రిమెంట్ డబ్బులు వెనక్కి ఇవ్వాలని ఒత్తిడి చేస్తోంది. కానీ రైతులు అంగీకరించడం లేదు. డబ్బులు ఇచ్చేది లేదని, భూములను కూడా అమ్మేది లేదని ఖరాకండిగా చెబుతున్నారు. స్థానిక వైసీపీ నాయకులు కూడా రైతులకు మద్దతు పలుకుతున్నారు. దీంతో మాజీ మంత్రి దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్నారు.

సెంట్రల్ లైబ్రరీ అభివృద్ధికి కృషి

గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభోత్సవంలో ఎంపీ అంబికా



జెండా ఊపి వారోత్సవాలను ప్రారంభిస్తున్న ఎంపీ

అనంతపురం విద్య, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని సెంట్రల్ లైబ్రరీ అభివృద్ధికి కృషి చేస్తామని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. గురువారం జాతీయ గ్రంథాలయ వారోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీ అంబికా, జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎంపీ జెండా ఊపి వారోత్సవాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా లైబ్రరీ మరింత అభివృద్ధి చెందాలన్నారు. జేసీ మాట్లాడుతూ సెంట్రల్ లైబ్రరీలో పాఠకులకు, పోటీ పరీక్షల కోసం విద్యార్థులకు అవసరమైన అన్ని పుస్తకాలను అందుబాటులో ఉంచామన్నారు. కార్యక్రమంలో మేయర్ వసీం, ఆర్డీఓ కేశవనాయుడు, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు, గ్రంథాలయ కార్యదర్శి రమా, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు



విజేతలతో ఆర్డీటీ మహిళా సాధికారత డైరెక్టర్ విశాలా ఫెర్రర్

అనంతపురం క్లాక్‌టవర్(ఆంధ్రజ్యోతి): ఆర్ట్ ఫెస్టివల్‌ను ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచోఫెర్రర్ ప్రారంభించారు. ప్రతిభ చాటిన చిన్నారులకు బహుమతులను అందజేశారు. క్లేమోడల్ పోటీల్లో మొదటి బహుమతి అక్షయ్ తేజ(రాప్తాడు), ద్వితీయ బహుమతి సంతోష్ (కురువపల్లి), తృతీయ బహుమతి రాజేష్ (ఉప్పొంక) గెలుచుకున్నారు. హ్యాండ్ రైటింగ్‌లో మనోజ్‌కుమార్ (పోతుకుంట), పల్లవి (చిన్నహోతూరు), స్వాతి (రాళ్లపల్లి) మొదటి మూడు బహుమతులను గెలుచుకున్నారు. న్యాచురల్ కోలేజ్‌లో మొదటి బహుమతి రేవతి(ఎద్దులపల్లి), ద్వితీయ బహుమతి ప్రసాద్ (మార్పురివారిపల్లి), తృతీయ బహుమతి నాగలక్ష్మి (దేవగిరి) గెలుచుకున్నారు. ఒరిగామి ఆర్ట్ వర్క్‌లో అక్షిత (కరుట్లపల్లి), మోక్షిత (ఏటిగడ్డతండా), అఖిల (ధర్మవరం) ఒకటి, రెండు, మూడు బహుమతులు పొందారు. పిక్చర్ పెయింటింగ్‌లో మొదటి బహుమతి సంజయ్‌గౌతమ్ (కురువల్లి), ద్వితీయ బహుమతి మానస(బొమ్మనహాళ్), తృతీయ బహుమతి పృథ్వి (కరుట్లపల్లి) గెలుచుకున్నారు. రంగోలిలో సుదర్శిని(కురువల్లి), వరుణ్(దేవరింటిపల్లి), ప్రవీణ్ (అనంతపురం) మొదటి మూడు బహుమతులను గెలుపొందారు. ఆర్డీటీ మహిళా సాధికారత డైరెక్టర్ విశాలా ఫెర్రర్, స్పెయిన్‌కు చెందిన స్పాన్సర్లు బహుమతులు ప్రదానం చేశారు. ఆర్డీటీ ఎడ్యుకేషన్ డైరెక్టర్ మురళీమోహన్, ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్లు, ఏరియా టీం లీడర్లు పాల్గొన్నారు.



విజేతలను అభినందిస్తున్న విదేశీయులు

రిజిస్ట్రేషన్లకు.. రీ సర్వే కష్టాలు..!

- ఎల్‌పీఎం నిబంధనలతో తిప్పలు
- సగానికిపైగా తగ్గిన రిజిస్ట్రేషన్లు
- గత ప్రభుత్వ నిర్ణయాలతో అవస్థలు
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి
- ఆరునెలలుగా అల్లాడుతున్న రైతులు



ధర్మవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

ధర్మవరం/చెన్నేకొత్తపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన ఎల్‌పీఎం (ల్యాండ్‌పార్సిల్ మేనేజ్‌మెంట్) విధానంతో భూములు, స్థలాల అమ్మకాల కొనుగోలుకు ఇబ్బందులు తప్పడం లేదు. అప్పటి ప్రభుత్వం శాశ్వత భూ హక్కు కల్పిస్తామని ఎంతో ఆర్భాటంగా చేపట్టిన భూ రీసర్వే రైతుల పాలిట గుదిబండగా మారింది. రీ సర్వేలో భాగంగా ఎల్‌పీఎంతో చాలా గ్రామాలకు సంబంధించి రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. భూములు రీసర్వే చేపట్టిన అనంతరం అధికారులు ఆయా సర్వే నెంబర్లకు ఎల్‌పీఎం నంబర్లు కేటాయించడంతో ఆ విధానమే రైతులకు శాపంగా మారింది. చాలా వరకు జాయింట్ ఎల్‌పీఎం కారణంగా భూముల సబ్ డివిజన్‌లు కాకపోవడంతో రిజిస్ట్రేషన్లు పూర్తిగా నిలిచిపోయి వాటి క్రయవిక్రయాలకు అవరోధంగా మారింది. దీంతో రైతులు దిక్కుతోచనిస్థితిలో పడ్డారు.

• ఆగిన రిజిస్ట్రేషన్లు

ధర్మవరం రెవెన్యూ డివిజన్‌లోని ధర్మవరం, చెన్నేకొత్తపల్లి సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయాల పరిధిలో ఎల్‌పీఎం కారణంగా రిజిస్ట్రేషన్లు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో చాలా మంది రైతులకు అసలు విషయం తెలియక రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. భూ రీసర్వే కింద కేటాయించిన జాయింట్ ఎల్‌పీఎంతో అసలు సమస్య తలెత్తిందని తెలుసుకుని అవాక్కవుతున్నారు. దీని కారణంగా ఎల్‌పీఎం నంబర్లలో భూముల సబ్ డివిజన్లు కాక వెబ్ ల్యాండ్ ఓపెన్ కావడం లేదని తెలుసుకుని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ధర్మవరం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలోని గొట్లూరు, బత్తలపల్లి, అప్రాచెరువు, తాడిమర్రి గ్రామాలతో పాటు చెన్నేకొత్తపల్లి సబ్‌రిజిస్ట్రార్ కింద ఏల్కుంట్ల, ముత్తవకుంట్ల, నరసంపల్లి, గంతిమర్రి, చెన్నేకొత్తపల్లి, ప్యాదిండి గ్రామాలకు సంబంధించి రీ సర్వేనెంబర్లకు ఎల్‌పీఎం నంబర్లు కేటాయించడంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. దీంతో ఆయా గ్రామాలలో భూముల క్రయవిక్రయాలకు ఆటంకం ఏర్పడటంతో ప్రభుత్వానికి ఆదాయం తగ్గిపోతోంది.

• ఆరు నెలలుగా అవస్థలు

గత ప్రభుత్వం తీసుకువచ్చిన ఎల్‌పీఎం విధానంతో భూసమస్యలు పరిష్కారం కావడం లేదు. అప్పట్లో ఎంతో హడావుడి చేసిన అధికారులు తరువాత పట్టించుకోకపోవడంతో రైతులు రిజిస్ట్రేషన్లు జరగక నానా తిప్పలు పడుతున్నారు. చాలా గ్రామాలలో ఆరునెలల నుంచి రిజిస్ట్రేషన్లు నిలిచిపోయినట్టు తెలుస్తోంది. దిక్కుతోచని పరిస్థితులలో తమ సమస్యలను పరిష్కరించాలంటూ అధికారుల చుట్టూ రైతులు తిరగాల్సిన పరిస్థితి నెలకొంది.

• రీ సర్వే విధానాన్ని రద్దు చేయాలి

రీ సర్వేతో రైతులకు లేనిపోని చిక్కులు తప్ప ఒరిగింది ఏమిలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎల్‌పీఎం విధానం రైతులకు గుదిబండగా మారింది తప్పా ఉపయోగం లేదనే వాదన లేకపోలేదు. దీంతో రీ సర్వే విధానాన్ని రద్దుచేయాలనే వాదన ప్రజల నుంచి వినిపిస్తోంది. ఈ విధానం వల్ల రైతుల భూములకు సంబంధించి సరైన రికార్డులు లేకుండా పోయాయని, కనీసం రిజిస్ట్రేషన్లు చేసుకుందామన్నా అందుకు అనుకూలంగా లేకుండాపోయిందని పలువురు వాపోతున్నారు.

రీ సర్వేతో అన్నీ కష్టాలే



భూ రీసర్వే వల్ల లేనిపోని ఇబ్బందులు తప్పా ఉపయోగం ఏమీలేదు. చెన్నేకొత్తపల్లిలో రీ సర్వే కింద ఎల్‌పీఎం నంబర్లతో భూముల రిజిస్ట్రేషన్లు కావడం లేదు. చాలా మంది రైతులకుఎక్కువ, తక్కువ విస్తీర్ణాలను చూపుతున్నారు. దీంతో భూ సమస్యలు తలెత్తున్నాయి. అధికారులు చొరవ తీసుకుని సమస్యను పరిష్కరించాలి.

- అమరేంద్రరెడ్డి, రైతు, చెన్నేకొత్తపల్లి

రిజిస్ట్రేషన్లు తగ్గినమాట వాస్తవమే

ఎల్‌పీఎం నంబర్ల కారణంగా భూములకు సంబంధించి సబ్‌డివిజన్‌లు కాకపోవడంతో వెబ్‌ల్యాండ్‌లు ఓపెన్ కావడంలేదు. దీంతో పలు గ్రామాలలో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. అక్టోబరు నెలలో అయితే సగానికి సగం రిజిస్ట్రేషన్లు తగ్గిపోయాయి. దీంతో ఆదాయం భారీగా తగ్గింది.

- తాయన్న, శ్రీరామ్‌నాయక్, సబ్ రిజిస్ట్రార్లు, ధర్మవరం, చెన్నేకొత్తపల్లి

క్రైం కార్నర్

మసీదు మినార్‌పై పిడుగు

• రూ.2లక్షలు నష్టం



పిడుగుపాటుకు దెబ్బతిన్న మినార్ (వృత్తంలో) ఇన్‌సెట్‌లో కింద పడిన మినార్ భాగం

నల్లమాడ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కురమాల గ్రామ నడిబొడ్డున ఉన్న మసీదుపై గురువారం 4.20 నిమిషాలకు పిడుగు పడింది. పిడుగు ధాటికి మసీదు పైభాగంలో ఉన్న మినార్ నేలకొరిగింది. మసీదు ముతవల్లి నిజాంవలీ తెలిపిన మేరకు మసీదులో ఎవరూలేని సమయంలో చిరుజల్లులు పడటంతో పాటు ఉరుములు, మేరుపులతో మినార్‌పై పిడుగు పడిందన్నారు. ఈ సమయంలో ఇక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందన్నారు. మసీదుకు అమర్చిన ఇన్‌వర్టర్, 15 ఫ్యాన్లు, పది ట్యూబ్‌లైట్లు, మోటారుతోపాటు స్టార్టర్, విద్యుత్ వైరింగ్, కాలి బూడిదైందన్నారు. రూ.2 లక్షలు నష్టం వాటిల్లిందన్నారు. ప్రభుత్వం మసీదు మరమ్మతులకు అన్నివిధాలా ఆదుకోవాలని కోరారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి



గౌతమ్ (ఫైల్)

రాయదుర్గంరూరల్, నవంబరు14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాశీపురానికి చెందిన విద్యార్థి గౌతమ్ (7) అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రభాకర్, శైలజ దంపతుల కుమారుడు గౌతమ్ ప్రభుత్వ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్నాడు. వారం రోజుల క్రితం జ్వరం రావడంతో అనంతపురం ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి ఊపిరితిత్తుల్లో ఇన్ఫెక్షన్ వుందని నిమోనియా సోకినట్లు గ్రహించి చికిత్స అందించినట్లు తెలిపారు. ఆస్పత్రిలో వారం రోజులుగా చికిత్స పొందుతూ మృతి చెందాడన్నారు. విద్యార్థి అక్క నవ్యశ్రీ కూడా డెంగీతో బాధపడుతూ మృతి చెందింది. గ్రామంలో చాలామంది జ్వరాలతో బాధపడుతున్నా వైద్య సిబ్బంది పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు.

సోషల్ మీడియా పోస్టులపై విచారణ

రాయదుర్గంరూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టాడనే అనుమానంతో ఆయతపల్లి గ్రామానికి చెందిన వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త ప్రసాద్‌రెడ్డిని బుధవారం మధ్యాహ్నం పోలీసులు ఇంటికి వచ్చి తీసుకెళ్లి విచారించి వదిలేశారు. పోలీసులు తిరిగి శుక్రవారం సెల్‌ఫోన్ తీసుకెళ్లాలని పిలిపించారు. రాత్రి అయినా కొడుకు ఇంటికి రాకపోవడంతో ప్రసాద్‌రెడ్డి తండ్రి బ్రహ్మానందరెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. అభ్యంతరకర పోస్టులు పెట్టాడనే అనుమానంతో కొడుకును తీసుకెళ్లి, విచారించి పంపించి తిరిగి సెల్‌ఫోన్ కోసం పిలిపించి ఇంటికి పంపలేదన్నారు. బ్రహ్మానందరెడ్డి ఉదయం నుంచి సాయంత్రం వరకు కుమారుని కోసం నిరీక్షించారు. దీనిపై సీఐ జయానాయక్‌ను వివరణ కోరగా.. ప్రసాద్‌రెడ్డిని పిలిపించామనీ, విచారించి ఇంటికి పంపినట్లు తెలిపారు.

ఆత్మహత్యకు ప్రేరేపించిన కేసులో..

ముగ్గురికి ఏడేళ్ల జైలు శిక్ష

అనంతపురం క్రైం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యకు ప్రేరేపించేలా చేసిన కేసులో ముగ్గురికి ఏడేళ్ల జైలు శిక్ష, చెరో రూ.3వేల జరిమానా విధిస్తూ అడిషనల్ అసిస్టెంట్ సెషన్స్ న్యాయాధికారి తీర్పు వెలువరించారు. అనంతపురంలోని వయోజన విద్య కార్యాలయంలో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న (మృతుడు) ఈశ్వరయ్యను ఆయన వద్ద పనిచేస్తున్న సబార్డినేట్ ఉద్యోగులు, ప్రస్తుతం శిక్షపడిన ముగ్గురు చెప్పిన ఉద్యోగం చేయకుండా, మానసికంగా వేధించేవారు. వారి వేదనను తట్టుకోలేక ఈశ్వరయ్య 2015 ఫిబ్రవరి 2న ఉదయం 10గంటల సమయంలో తన ఆఫీస్‌లోనే ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతిచెందాడు. ఈశ్వరయ్య భార్య ఫిర్యాదు మేరకు అప్పటి వన్‌టౌన్ ఎస్ఐ రాంప్రసాద్ కేసు నమోదు చేశారు. అనంతరం సీఐ రాఘవన్ కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. అన్ని కోణాల్లో విచారించిన అనంతరం గురువారం అనంతపురం అడిషనల్ అసిస్టెంట్ సెషన్స్ న్యాయాధికారి నిర్మల.. నిందితులకు ఏడేళ్ల జైలు శిక్ష, చెరో రూ.3వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. పీపీలు వెంకట్రామిరెడ్డి, సాక్షులను సకాలంలో కోర్టులో హాజరు పరచిన వన్‌టౌన్ సీఐ రాజేంద్రనాథ్‌యాదవ్, కోర్టు మానిటరింగ్ సిస్టం సీఐ వెంకటేష్‌నాయక్, కోర్టు లైజన్ ఆఫీసర్ ఏఎస్ఐ శ్రీనివాసులు, కోర్టు హెడ్ కానిస్టేబుల్ షమీవుల్లా, వన్నూరప్పను జిల్లా ఎస్పీ జగదీష్ అభినందించారు.

అంగన్‌వాడీ కేంద్రానికి తాళం



వరండాలో భోజనం చేస్తున్న చిన్నారులు

పెద్దవడుగూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని బుర్నాకుంట గ్రామ అంగన్‌వాడీ కేంద్రానికి తాళం వేసిన ఘటన చోటుచేసుకుంది. 2013లో ఇదే గ్రామానికి చెందిన పక్కీరప్ప అనే వ్యక్తి అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణానికి స్థలం ఉచితంగా ఇవ్వడంతోపాటు ఆ భవనాన్ని ప్రభుత్వ నిధులతో ఆయనే నిర్మించాడు. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రం పరిసర ప్రాంతాల్లో ఆకుకూరలు పెంచడం కోసం పూలకుండీలను ఏర్పాటుచేయడంతో ఆ విషయం నచ్చని సదరు వ్యక్తి పూలకుండీలను తొలగిస్తారా లేకుంటే కేంద్రానికి తాళం వేస్తానని హెచ్చరించారు. దీనిని అంగన్‌వాడీ కేంద్రం సిబ్బంది పట్టించుకోకపోవడంతో కేంద్రానికి ఆ వ్యక్తి తాళం వేశారు. దీంతో చిన్నారులు వరండాలో భోజనం చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

కునుకుంట్ల కుంటకు నీరివ్వండి



మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్

ధర్మవరం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తాడిమర్రి మండలం కునుకుంట్ల గ్రామంలో నీరు లేక నిర్జీవంగా మారిన కుంటకు పీబీసీ ద్వారా నీరు ఇవ్వాలని ఆ గ్రామస్థులు టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్‌ను కోరారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో గ్రామస్థులు శ్రీరామ్‌ను కలిశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ కొన్నేళ్లగా కుంటలో నీరు లేక భూగర్భజలాలు ఇంకిపోయే పరిస్థితి వచ్చిందన్నారు. పీబీసీ కుడి కాలువ తాడిమర్రి మండలంలో ఉన్నప్పటికీ నీరు వచ్చేపరిస్థితి లేదన్నారు. ఈసారి ప్రాజెక్టుల్లో నీరు ఉన్న క్రమంలో కనీసం ఈ ఏడాదైనా కాలువకు నీరు ఇవ్వాలని రైతులు విజ్ఞప్తి చేశారు. దీనిపై శ్రీరామ్ స్పందిస్తూ కునుకుంట్లకు నీరు వచ్చే మార్గాలను ఆ గ్రామానికి వచ్చి పరిశీలిస్తామని, జలవనరుల శాఖ మంత్రి, కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సంధా రాఘవ, తాడిమర్రి మండల కన్వీనర్ కూచి రామ్మోహన్ పాల్గొన్నారు. అనంతరం సభ్యత్వనమోదుపై పరిటాల శ్రీరామ్ సమావేశం నిర్వహించారు.

అభివృద్ధిలో పవన్‌కల్యాణ్ మార్క్ చూపుతాం

- అహుడా చైర్మన్ టీసీ వరుణ్
- నాయకులు, కార్యకర్తల ఘన స్వాగతం



గుత్తిరోడ్డు సర్కిల్లో గజమాలతో స్వాగతం పలుకుతున్న కూటమి నాయకులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంత జిల్లా అభివృద్ధిలో క్రియాశీలక భూమిక పోషించే అహుడా సంస్థ అభివృద్ధిలో తమ అధినేత పవన్‌కల్యాణ్ మార్క్ ఏంటో చూపుతామని అహుడా చైర్మన్, జనసేన జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్ అన్నారు. అహుడా చైర్మన్ హోదాలో నగరానికి వచ్చిన ఆయనకు కూటమి నేతలు ఘన స్వాగతం పలికారు. బాటలో సుంకులమ్మ దేవలయం వద్ద ప్రత్యేక పూజల అనంతరం నగరంలోని గుత్తి రోడ్డు సర్కిల్‌కు చేరుకున్న వరుణ్‌కు నాయకులు, కార్యకర్తలు భారీ గజమాలతో స్వాగతం పలికారు. పాతూరు, శ్రీకంఠం సర్కిల్, టవర్ క్లాక్ వద్ద నాయకులు, కార్యకర్తలు అభిమానులు టపాసులు, పూలవర్షంతో ఆహ్వానించారు. టీసీ వరుణ్ మాట్లాడుతూ అహుడా సంస్థను అభివృద్ధిపథంలో నడిపించేందుకు కృషి చేస్తానన్నారు. జనసేన పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతంచేసి ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానన్నారు. నగర అభివృద్ధి విషయంలో అందర్నీ సమన్వయం చేసుకొని ముందకెళ్తామన్నారు. కూటమి నేతల పరస్పర సహాయసహకారాలతో అభివృద్ధికి బాటలు వేస్తామని స్పష్టం చేశారు. అనంతరం నివాసానికి చేరుకున్న వరుణ్‌కు కుటుంబసభ్యులు స్వీట్లు తినిపించి ఆనందం పంచుకున్నారు.

పలు ప్రాంతాల్లో వర్షం

అనంతపురం అర్బన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం వర్షం పడింది. అనంతపురం, రాప్తాడు, తాడిపత్రి, పుట్లూరు, బెలుగుప్ప, గుంతకల్లు, కూడేరు, శింగనమల, ఉరవకొండ, పామిడి, డి.హిరేహాల్, నార్పల, గార్లదిన్నె, గుత్తి, విడపనకల్లు మండలాల్లో ఓ మోస్తారు వర్షం పడింది. బొమ్మనహాల్, కళ్యాణదుర్గం, యాడికి తదితర మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి.

రానున్న మూడురోజుల్లో వర్ష సూచన

బుక్కరాయసముద్రం: ఉమ్మడి జిల్లాలో రానున్న మూడు రోజుల్లో వర్ష సూచన ఉన్నట్లు ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధనా కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త గుత్తానారాయణ స్వామి తెలిపారు. పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్ష సూచన ఉన్నట్లు తెలిపారు. ఈశాన్య దిశగా గాలులు గంటకు 2-5 కి.మీ వేగంతో వీచే అవకాశం ఉంది. వర్ష సూచన ఉన్న నేపథ్యంలో రైతులు పిచికారి పనులు వాతావరణ పరిస్థితిని గమనించి చేసుకోవాలన్నారు. నీటి వసతి ఉన్న రైతులు రబీ వేరుశనగ విత్తుకోవటానికి నవంబరు15 నుంచి డిసెంబరు 15 వరకు అనుకూలమైన సమయమన్నారు.

స్పాట్ అడ్మిషన్లు

అనంతపురం సెంట్రల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎంటెక్, ఎంఫార్మసీ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ కిరణ్మయి గురువారం ప్రకటనలో తెలిపారు. ఏపీ పీజీసెట్-2024లో అర్హత సాధించి డిగ్రీలో ఉత్తీర్ణులై ఇప్పటివరకు ఎక్కడా అడ్మిషన్ పొందని వారు అర్హులని పేర్కొన్నారు. స్పాట్ అడ్మిషన్ అయ్యేవారికి ఫీజురీయింబర్స్‌మెంట్ రాదని ప్రవేశం పొందినరోజే ఫీజు మొత్తం చెల్లించాలని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు వారి ఒరిజనల్ సర్టిఫికెట్స్‌తో 16వ తేదీన అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్‌కు రావాలని కోరారు. వివరాలకు www.jntua.ac.in సందర్శించాలని సూచించారు.

అర్హులందరికీ పింఛన్ ఇవ్వాలి

• అసెంబ్లీలో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి

పుట్టపర్తిరూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): 'గత వైసీపీ ప్రభుత్వం టీడీపీ మద్దతుదారులంటూ వేలాది మంది అర్హులకు పింఛన్లు రాకుండా చేసింది. అంతేకాకుండా ఆ పార్టీ మద్దతుదారులైన మూడు లక్షల మంది అనర్హులకు పింఛన్లు మంజూరు చేసింది. వెరిఫికేషన్ చేసి ఆ అనర్హులను తొలగించి.. అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్ మంజూరు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలి' అని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం అమరావతిలో నిర్వహించిన శాసనసభ సమావేశాల్లో ఆమె సంబంధిత మంత్రి కొండపల్లి సురేష్‌కు విజ్ఞప్తి చేశారు. 50 ఏళ్లకు పైబడిన వారందరికీ పింఛన్ హామీని ఎప్పటి నుంచి అమలు చేస్తారో ఒక నిర్దిష్టమైన సమయాన్ని ప్రకటించాలని కోరారు. దివ్యాంగులు సదరం క్యాంపునకు వెళ్లి ధ్రువపత్రం పొందడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అటువంటి వారికి ప్రతి నియోజకవర్గంలో ప్రత్యేకంగా ఒక సదరం క్యాంపును ఏర్పాటు చేయాలని సంబంధిత మంత్రి శ్రీనివాస్‌ను కోరారు.

సత్యసాయి జయంతికి గవర్నర్‌కు ఆహ్వానం



గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఆర్జే రత్నాకర్

పుట్టపర్తిరూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : సత్యసాయి బాబా శత జయంత్యుత్సవాలకు రావాల్సిందిగా రాష్ట్ర గవర్నర్ అబ్దుల్‌నజీర్‌కు సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ ఆహ్వానం పలికారు. గురువారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసిన ఆయన.. ఈ నెల 23న ప్రశాంతినిలయంలో జరిగే బాబా జయంతి వేడుకల్లో పాల్గొనాలని కోరారు.

వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్లుగా నలుగురికి చోటు

అనంతపురం అర్బన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి, బోయ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్లుగా జిల్లాకు చెందిన నలుగురికి చోటు దక్కింది. ఈ మేరకు టీడీపీ అధిష్టానం గురువారం రాత్రి జాబితాను విడుదల చేసింది. శింగనమల నియోజకవర్గానికి చెందిన కుళ్లాయప్ప, జనసేన నాయకుడు అంకె ఈశ్వరయ్య, అనంతపురం అర్బన్ నియోజకవర్గం లక్ష్మీనరసింహమూర్తి, కళ్యాణదుర్గం రమేష్‌బాబును రాష్ట్ర డైరెక్టర్లుగా నియమించారు.

చట్టాలపై అవగాహన అవసరం

అనంతపురం క్రైం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చట్టాలపై కనీస అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి, న్యాయాధికారి శివప్రసాద్ యాదవ్ అన్నారు. గురువారం కేఎస్ఎన్ ప్రభుత్వ పాఠశాలలో బాలల చట్టాలపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. చట్టపరమైన సమస్యలకు వివరాలను సందేశాత్మకంగా, వివరణాత్మకంగా న్యాయాధికారి వివరించారు. వి ద్యాశాఖ అధికారి ప్రసాద్‌బాబు, న్యాయవాది హరికృష్ణ, ప్రధానోపాధ్యాయుడు అంజనేయులు పాల్గొన్నారు.

18 ఏళ్లు పైబడిన వారికి క్యాన్సర్ పరీక్షలు

శింగనమల, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా 18 సంవత్సరాలు పైబడిన వారికి క్యాన్సర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఈబీ దేవి తెలిపారు. మండలంలోని కల్లుమడి గ్రామంలో గురువారం ఇంటింటి క్యాన్సర్ పోస్టర్లను ఆమె విడుదల చేశారు. అనంతరం వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. గ్రామాల్లో వైద్యసిబ్బంది ఇంటింటా తిరిగి 18 ఏళ్ల నిండిన వారికి క్యాన్సర్ ఉచిత పరీక్షలు చేయాలని ఆదేశించారు. నోరు, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్‌తో పాటు దీర్ఘకాలిక వ్యాధులపై సమాచారం సేకరించి వైద్యం అందించాలన్నారు. ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నారాయణస్వామి, తరిమెల వైద్యాధికారి శంకర్‌నాయక్, తేజస్విని, గాంగధర్ ఆశ్వర్థు, దివ్యభారతి, తిరుపాలమ్మ పాల్గొన్నారు.

ఓపీఎస్ పోరాటం ఆగదు

• మజ్దూర్ యూనియన్ జోనల్ కార్యదర్శి సీహెచ్ శంకర్రావు

గుంతకల్లు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఎన్‌పీఎస్ స్థానంలో తెచ్చిన యూపీఎస్ కొంత మెరుగైనదే అయినా, ఓపీఎస్‌ను సాధించే వరకూ మజ్దూర్ యూనియన్ విశ్రమించదని ఆ సంఘం జోనల్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ శంకర్రావు అన్నారు. రైల్వే ఉద్యోగ సంఘ గుర్తింపు ఎన్నికల్లో భాగంగా శంకర్రావు ఆధ్వర్యంలో మజ్దూర్ యూనియన్ నాయకులు గురువారం ఉదయం వివిధ విభాగాలలో ప్రచారం నిర్వహించారు. రైల్వే కంట్రోల్ రూం, డీజిల్ షెడ్ తదితర శాఖల్లో యూనియన్‌కు ఓటు వేయాలని ప్రచారం చేశారు. శంకర్రావు మాట్లాడుతూ 8వ పే రివిజన్ కమిషన్ (పీఆర్సీ)ని వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కులను కాపాడే సంఘం మజ్దూర్ యూనియన్ అని అన్నారు. ఈ ఎన్నికల్లోనూ యూనియన్‌కు ఓటువేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఉద్యోగులను కోరారు. రాత్రి రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో ప్రచార సదస్సును నిర్వహించారు. యూనియన్ జాయింట్ వర్కింగ్ కమిటీ సభ్యుడు శ్రీనివాసులు, డివిజనల్ కార్యదర్శి విజయకుమార్, ఏడీఎస్ అశ్విని, నాయకులు మస్తాన్ వలి, జాఫర్ ఖాన్, ఎస్ఎం బాషా, సుధాకర్, రాజశేఖర్, మస్తాన్, రాజ, నతానియెల్ పాల్గొన్నారు.

పిల్లల అభివృద్ధిలో తల్లిదండ్రులదే కీలక పాత్ర

• ఎస్పీ జగదీష్ దంపతులు



ఎస్పీ దంపతులకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఉపాధ్యాయులు

అనంతపురం క్రైం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పిల్లల అభివృద్ధిలో తల్లిదండ్రులదే కీలక పాత్ర అని ఎస్పీ జగదీష్ దంపతులు అన్నారు. జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని పోలీస్ కాన్ఫరెన్స్ రక్షక్ ప్రీ ప్రైమరీ స్కూలు పిల్లల మధ్య ఘనంగా బాలల దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎస్పీ దంపతులు హాజరై మాట్లాడారు. పిల్లల భవిష్యత్తు నిర్దేశంలో తల్లిదండ్రుల పాత్ర చాలా ఉందన్నారు. వచ్చే విద్యాసంవత్సరంలో పోలీసు పిల్లలు ఫస్ట్‌క్లాస్ చదువుకునేలా అనుమతుల కోసం దరఖాస్తు చేశామన్నారు. స్పానిష్ టీచర్ కోసం ఆర్టీటీ వారికి లేఖ రాశామని, పిల్లలకు చదువుతో పాటు ఆటలు, డ్యాన్స్, ఇతర అభివృద్ధికి కృషి చేస్తామని పిలుపునిచ్చారు. అనంతరం పిల్లలకు బిస్కెట్స్, పెన్నులు తదితర సామగ్రిని అందజేశారు. పిల్లలు బృందంగా ఏర్పడి రోడ్డు ప్రమాదాల నియంత్రణ, రోడ్డు భద్రతా నియమాల పాటింపుపై చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. హెడ్ క్వార్టర్స్‌లో నిర్వహిస్తున్న రక్షక్ ప్రీ ప్రైమరీ స్కూలు పిల్లల కోసం సిద్ధం చేసిన గదిని ఎస్పీ సతీమణి హేమ ప్రారంభించారు. అదనపు ఎస్పీలు రమణమూర్తి, ఇలియాజ్‌బాషా, సీఐలు ధరణికిషోర్, క్రాంతికుమార్, దేవానంద్, ఆర్ఐలు రెడ్డప్పరెడ్డి, మధు పాల్గొన్నారు.

జూనియర్ అథ్లెటిక్స్‌లో విద్యార్థినికి గోల్డ్ మెడల్



సుదీక్షను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఉరవకొండ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాకెట్ల గ్రామానికి సుదీక్ష జూ నియర్ అథ్లెటిక్స్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించింది. బెంగళూరులో ఎంబీఏ చదు వుతున్న ఈమె గత నెల 13వ తేదీన చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన సౌత్ ఏషియన్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీలో పాల్గొని పరుగు పందెంలో గోల్డ్ మెడల్ సాధించింది. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఉపాధ్యాయులు, గ్రామస్థులు సన్మానించారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం వెంకటస్వామి పాల్గొన్నారు.

జీయో ట్యాగింగ్ ప్రగతిపై డీపీఓ అసంతృప్తి

• కార్యదర్శుల్లో మార్పు రాకుంటే చర్యలు: డీపీఓ



సిబ్బందితో చర్చిస్తున్న డీపీఓ నాగరాజనాయుడు

అనంతపురం న్యూటౌన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఇంటింటి జియోట్యాగింగ్ ప్రగతిపై డీపీఓ నాగరాజ నాయుడు అసంతృప్తి వ్యక్తం చేశారు. గురువారం ఆయన రూరల్ మండలం కక్కలపల్లి పంచాయతీలో తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది చేపట్టిన ఎన్‌సీసీఏ, ఇంటింటి జియో ట్యాగింగ్ నమోదును ఆయన తనిఖీ చేశారు. సిబ్బందితో వివరాలు అడిగి తెలుసుకున్నారు. సచివాలయ సిబ్బంది కార్యాలయంలో వారి బయోమెట్రిక్ నమోదు చేసుకొని ఫీల్డ్‌కు వెళ్లి జియోట్యాగింగ్‌లో ప్రగతి కనిపించేలా చూడాలన్నారు. మీలో మార్పు రాకపోతే ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. రుద్రంపేట పంచాయతీ శ్రీనగర్ కాలనీలో స్థానికులు పలు సమస్యలను డీపీఓ దృష్టికి తీసుకువచ్చారు. తాగునీరు, వీధిదీపాల సమస్యను వెంటనే పరిష్కరించేలా చూడాలని కార్యదర్శిని ఆదేశించారు.

విద్యార్థులను ఇబ్బంది పెట్టొద్దు: జనన ధ్రువీకరణ పత్రాల కోసం విద్యార్థులను ఇబ్బంది పెట్టొద్దని డీపీఓ నాగరాజనాయుడు కార్యదర్శులకు సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న విద్యార్థుల వివరాల నమోదులో జనన ధ్రువీకరణ పత్రం అవసరమని ఇందుకోసం వచ్చేవారికి ఇబ్బందులు తలెత్తకుండా తక్షణం జారీ చేయాలని ఆదేశించారు. దీనిపై కార్యదర్శులకు సర్క్యులర్ కూడా జారీ చేశామన్నారు.

గిరిజన పంచాయతీల్లో గ్రామసభలు: జిల్లాలో కేంద్ర ప్రభుత్వం నుంచి నోటిఫై చేసిన గిరిజన పంచాయతీల్లో శుక్రవారం గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు డీపీఓ నాగరాజనాయుడు తెలిపారు. గిరిజన ఉద్యమకారుడు బిరిసముండా 150వ జయంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. గుంతకల్లు మండలంలోని గుండాల తండా, వజ్రకరూరు మండలంలోని వెంకటాంపల్లి తండా, శింగనమల మండలంలోని చిన్నవరం తండా పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహిస్తామన్నారు.

న్యూస్ బాక్స్...



అవార్డు గ్రహీతకు సన్మానం

బుక్కపట్నం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిస్టరీ అధ్యాపకుడు రాజ్‌మహమ్మద్‌కు ఉత్తమ అధ్యాపకుడిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బుధవారం విజయవాడలో అవార్డు అందజేశారు. అతన్ని గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మగ్బుల్‌హుస్సేన్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

బడికి, గుడికి స్థలం కేటాయించండి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

కొత్తచెరువు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక జగనన్న లేఅవుట్‌లో బడి, గుడి, ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు స్థలం కేటాయించాలని సీపీఎం నాయకులు తహసీల్దార్ నీలకంఠారెడ్డికి గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. ఆ కాలనీలో బడి లేకపోవడంతో దాదాపు 2 కిలోమీటర్ల దూరంలోని పాఠశాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. జగనన్న లేఅవుట్‌లోని ఖాళీ స్థలాలు అన్యాక్రాంతం అవుతున్నాయని, అర్హులైన పేదలకు ఆ స్థలాలను కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బ్యాళ్ల అంజి, ముత్యాలు, పవన్, శ్రావణీ, శంకర్‌రెడ్డి, పెద్దన్న, కేశవ పాల్గొన్నారు.

రేపు అంగన్‌వాడీల ధర్నా

ధర్మవరం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని శనివారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నామని, దీన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ ప్రాజెక్టు అధ్యక్షురాలు సరస్వతి కోరారు. గురువారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో వారు మాట్లాడుతూ... అంగన్‌వాడీ మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, మినీ వర్కర్లకు మెయిన్ వర్కర్లుగా ప్రమోషన్ ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న రూమ్ బాడుగలను చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీఐటీయూ మండల కో కన్వీనర్‌లు అయూబ్‌ఖాన్, ఆదినారాయణ, అంగన్‌వాడీలు దీనా, పోతక్క, అనిత పాల్గొన్నారు.

బెల్లం ఊట ధ్వంసం

కదిరిఅర్బన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని బత్తలపల్లి తండా సమీపంలో 860 లీటర్ల బెల్లం ఊటను గురువారం ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ వీరారెడ్డి తెలిపారు. ఈ దాడుల్లో సిబ్బంది శ్రీధర్, దత్తాత్రేయ, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ ఆలీబేగ్ పాల్గొన్నారు.

వర్షానికి దెబ్బతిన్న పంటలు



నారప్పగారిపల్లి వద్ద వర్షానికి దెబ్బతిన్న వరిపంట

ఓబుళదేవరచెరువు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): తుఫాను ప్రభావంతో నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చేతికొచ్చే వరి పంట పూర్తిగా దెబ్బతింది. మండలంలో గురువారం కురిసిన భారీ వర్షానికి నారప్పగారిపల్లి, వీరఓబన్నపల్లి, దొన్నికోటవారిపల్లి, తదితర గ్రామాల్లో వరిపంట నీటిపాలైంది. నారప్పగారిపల్లికి చెందిన రెడ్డిపల్లి రాజారెడ్డి, వెంకట్‌మల్లిరెడ్డి, దీపా, రామచంద్ర, రంగప్ప, వీర ఓబునపల్లిలో పైపేటి రామమోహన్‌రెడ్డి, వై. ఈశ్వర్‌రెడ్డి, దొన్నికోటవారిపల్లిలో సానే హనుమంతురెడ్డి, నాగిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, తదితరులకు చెందిన దాదాపు 15 ఎకరాలో వరి పంట దెబ్బతింది. నాలుగైదు రోజుల్లో చేతికొచ్చే పంట నీటిపాలు కావడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు.

విద్యుత్ ట్రూఅప్ చార్జీలు తగ్గించాలి



ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

ధర్మవరం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ట్రూఅప్ చార్జీలు తగ్గించాలని సీపీఎం, రైతుసంఘం, సీఐటీయూ నాయకులు గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లిపెద్దన్న మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పి... అధికారంలోకి రాగానే ట్రూ అప్ చార్జీలు పెంచడం దారుణమన్నారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు హెచ్ బాషా, సీపీఎం పట్టణ కార్యదర్శి మారుతి, సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, కో కన్వీనర్ ఎల్ ఆదినారాయణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగార్జున, నాయకుడు కదిరెప్ప పాల్గొన్నారు.

మహిళలపై దాడులను నియంత్రించండి

బత్తలపల్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మహిళలకు పూర్తి అవగాహన కల్పించి.. వారిపై దాడులు జరగకుండా నియంత్రించాలని డీఎస్పీ శ్రీనివాసులు సూచించారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో గురువారం మహిళా పోలీసులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళలు, యువతులు, బాలికల వెంట పడి ఎవరైనా వేధిస్తే.. బాధితులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చేలా అవగాహన కల్పించాలన్నారు. ఇలా చేయడం వల్ల వారిపై దాడులు నియంత్రించవచ్చన్నారు. వీటిపైన గ్రామాల్లో మహిళలకు అవగాహన కల్పించారు. ప్రతిరోజు మహిళా పోలీసులు గ్రామాల్లో పర్యటిస్తూ.. ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో సీఐ ప్రభాకర్, ఎస్ఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

తనకల్లు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని బంగారువాండ్లపల్లి సమీపంలో గురువారం సాయంత్రం జూదమాడుతున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ గోపి తెలిపారు. వారివద్ద నుంచి రూ.1,060 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు చెప్పారు.



పుట్టపర్తి : నెహ్రూ చిత్రపటం వద్ద ఎస్పీ నివాళి



ధర్మవరం: దుప్పట్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు



తనకల్లు : కొక్కంటిలో చాచా నెహ్రూకు నివాళి

ఘనంగా బాలల దినోత్సవం

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్ : జిల్లా వ్యాప్తంగా దేశ మాజీ ప్రధాని, దివంగత పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని బాలల దినోత్సవం పేరుతో ఘనంగా నిర్వహించారు. పలు ప్రభుత్వ కార్యాలయాల్లో, ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో నెహ్రూ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ రత్న నెహ్రూ చిత్రపటం వద్ద నివాళుల ర్పించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బాలల దినోత్సవాన్ని నిర్వ హించారు. బత్తలపల్లిలోని బాలికల పాఠశాలలో గత ఏడాది పదో తరగతిలో అధిక మార్కులు సాధిం చిన విద్యార్థులకు అదే పాఠశాలలో విధులు నిర్వహించి.. ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయురాలు మారుతి నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. కదిరిలోని బ్లూమూన్ పాఠశాలలో విద్యార్థులు సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ధర్మవరం గాంధీనగర్ ప్రభుత్వ బాలుర వసతి గృహంలో 20 మంది విద్యార్థులకు బీజేపీ నాయకులు దుప్పట్లు, నోట్‌పుస్తకాలు అందజేశారు.



బత్తలపల్లి : నగదు బహుమతి అందజేస్తున్న రిటైర్డ్ ఉపాధ్యాయుడు మారుతి



కదిరి : బ్లూమూన్ పాఠశాలలో విద్యార్థుల నృత్యం



కొత్తచెరువు: నెహ్రూ విగ్రహం వద్ద డీసీసీ మాజీ అధ్యక్షుడు కోటా సత్యం



ధర్మవరం : ఉషోదయ స్కూల్‌లో నెహ్రూవేషధారణ

క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు



నల్లచెరువులో మాట్లాడుతున్న డీపీహెచ్ఎన్ఓ వీరమ్మ

నల్లచెరువు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల కార్యక్రమాన్ని డీపీహెచ్ఎన్ఓ వీరమ్మ, వైద్యాధికారి కల్పన గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ సిబ్బంది ప్రతి ఇంటికి వచ్చి కేన్సర్ గుర్తించేందుకు స్క్రీనింగ్ పరీక్షలతోపాటు బీపీ, షుగర్ పరీక్షలనూ నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ రామచంద్రారెడ్డి, సీహెచ్ఎన్ భారతి, రెడెమ్మ, నసిరీన్, సరస్వతి, యోగి, శ్రీనివాసరెడ్డి, టీడీపీ నాయకులు అశ్వర్థనాయుడు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

● తనకల్లు: మండలంలోని కొక్కంటి, తవళం, బాలసముద్రం గ్రామ సచివాలయాల్లో క్యాన్సర్ సర్వే కార్యక్రమాన్ని వైద్యా ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సర్వేను నోడల్ అధికార డాక్టర్ వీరమ్మ పరిశీలించారు. ఇందులో కొక్కంటి ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారులు లోకేశ్వర్‌రెడ్డి, ధర్మరాజు, సూపర్‌వైజర్ సూర్యనారాయణరెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ మంజుల, ఆశా కార్యకర్తలు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో రూ.2.39 లక్షల అవినీతి

నంబులపూలకుంట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఉపాధి పథకం కింద మండలంలోని 14 పంచాయతీల్లో రూ.12.70 కోట్లతో పనులు చేయగా.. రూ.2,39,261 అవినీతి జరిగినట్లు అధికారులు తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సామాజిక తనిఖీ ప్రజావేదికను ఎంపీపీ రాము అధ్యక్షతన పీడీ విజయప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. 14 పంచాయతీల్లో చేపట్టిన పనులు, ఖర్చులు, రీకవరీ.. తదితర వాటి వివరాలను వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌పీ చంద్రమౌళి, ఏపీడీ రమేష్‌బాబు, ఎంపీడీఓ ఆంజనప్ప, ఎంపీఓ చంద్రశేఖర్, ఈసీ రమేష్, టీడీపీ కన్వీనర్ చంద్రశేఖర్ నాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జీ దండే రవిశంకర్, కూలీలు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

కొక్కంటిలో గ్రామసభ

తనకల్లు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొక్కంటిలో గురువారం రెవెన్యూ అధికారులు గ్రామసభను నిర్వహించారు. వివిధ శాఖలకు సంబంధించిన 13 మంది అర్జీలను అందచేసినట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ మల్లికార్జున తెలిపారు.

● గాండ్లపెంట: మండలంలోని కటారుపల్లి గ్రామ సచివాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను గురువారం తహసీల్దార్ బాబురావు ఆధ్వర్యంలో నిర్వహించారు. పింఛన్లు, గృహనిర్మాణాలు, రెవెన్యూ తదితర సమస్యలపై వినతులు అందచేశారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ జాఫర్‌వలీ, వీఆర్ఓ కిష్టప్ప, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై అవగాహన

నల్లమాడ, నవంబరు14(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాల యంలో పంచాయతీ కార్యదర్శులు, వెలుగు సిబ్బంది పంచాయతీల అభివృద్ధిపై సీనియర్ అసిస్టెంట్ లోకా మల్లికార్జునరెడ్డి గురువారం అవగాహన కల్పించారు. 2024-25 నిధుల రాకకోసం పనులు గుర్తించాలని, ఆ పనులకు నిధులు మంజూరవు తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు విశ్వనాథ్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, మహమ్మద్‌బేగ్, మస్తాన్, సూర్యచంద్రారెడ్డి, ఉస్మాన్, త్రివేణి, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

సహకార వారోత్సవాలు

గాండ్లపెంట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక సహకారబ్యాంక్‌లో 71వ అఖిల భారత సహకార వారోత్సవాలను గురువారం నిర్వహించారు. సహకార పతాకాన్ని ఆవిష్కరించిన ఆ బ్యాంక్ పర్సన్ ఇన్‌చార్జ్ ప్రభాకర్‌నాయక్ మాట్లాడారు. పంటలపై రుణాలు పొందిన రైతులు సకాలంలో రెన్యువల్ చేయించుకోవాలన్నారు. సహకార సంఘం బలోపేతానికి కృషి చేయాలని, ఇతర బ్యాంక్‌లకు దీటుగా సేవలు తమ బ్యాంక్ అందిస్తోందని అన్నారు. కార్యక్రమంలో విశ్రాంత జీజీఎం సుబ్బరాయుడు, సీఈఓ షామీర్‌బాషా, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎస్‌టీయూ సభ్యత్వ నమోదు

నంబులపూలకుంట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కేజీబీవీలో ఎస్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి గురువారం చేపట్టారు. కేజీబీవీలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఎంటీఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టీయూ సభ్యులు రమణ నాయక్, మురళి సందీప్, రహీమ్, రూపారాణి, పావని, అరుణ, పార్వతి, శోభ, శ్రీలత, రుద్రమ్మ, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం

పుట్టపర్తిరూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో విధులు నిర్వహిస్తూఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన హోంగార్డు అంజనేయులు కుటుంబానికి జిల్లా ఎస్పీ ఆర్థిక సహాయం అందచేశారు. గురువారం జిల్లా పోలీసుకార్యాలయంలో హోంగార్డు అంజనేయులు భార్య జయలక్ష్మికి రు 4,32,000 చెక్కును అందచేశారు. ఇతరత్రా రావాల్సిన మొత్తాన్ని త్వరితగతిన వచ్చే విదంగా చర్యలు తీసుకుంటామని ఆమెకు ఎస్పీ భరోసా కల్పించారు.



ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

నిత్యావసరాల ధరలు తగ్గించాలి

కదిరి అర్బన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): నిత్యవసర వస్తువుల ధరలు తగ్గించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ఆందోళన చేపట్టారు. రోజురోజుకు నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయని, పేద, మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసర వస్తువులను సరసమైన ధరలకు అందించాలన్నారు. అలాగే పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలన్నారు. ట్రూఅప్ చార్జీల పేరుతో రూ.వేల కోట్ల భారాన్ని ప్రజలపై వేయడాన్ని ఆపాలన్నారు. స్మార్టు మీటర్లు రద్దు చేయాలన్నారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు ఉపసంహరించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు జగన్మోహన్, ముస్తాక్, బాబ్‌జాన్, రామమోహన్, అంజనేయులు, క్రిష్ణానాయక్, నారాయణ, ఫాజుల పాల్గొన్నారు.

ఏఎస్ఐ రూపకర్తలకు ప్రశంసలు



ఖదీర్, గిరివర్దన్‌ను అభినందిస్తున్న పరిటాల శ్రీరామ్

ధర్మవరం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచంలోని మొట్టమొదట ఆర్టిఫిషియల్ సూపర్ ఇంటిలిజెన్స్ (ఏఎస్ఐ) ప్లాట్‌ఫాంను రూపొందించిన ధర్మవరానికి చెందిన షేక్‌ఖదీర్ బాషా, కదిరికి చెందిన గిరివర్దన్‌ను టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్‌ను అభినందించారు. వీరు ప్రస్తుతం మదనపల్లి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్స్ (మిట్స్)లో బీటెక్ చదువుతున్నారు. వీరు తమ మిత్రులు సింహాద్రి, ఎన్‌కే వర్దన్‌నాయుడు, కార్తీక్‌లతో కలిసి.. ఈ మైక్రో సాఫ్ట్ ప్లాట్‌ఫాంను రూపొందించారు. వీరు గురువారం మర్యాదపూర్వకంగా పరిటాల శ్రీరామ్‌ను కలిశారు. వారిని ఆయన అభినందించి.. భవిష్యత్ మరిన్ని ఆవిష్కరణకు కృషి చేయాలని ఆకాంక్షించారు.

లక్ష్మీకాంత బృందావనంలో ధాత్రీహోమం



ఉసిరిచెట్టు కింద హోమం నిర్వహిస్తున్న దృశ్యం

పెనుకొండ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి):కార్తీక మాస చతుర్ధశిని పురస్కరించుకుని స్థానిక లక్ష్మీకాంత తీర్థుల బృందావనంలో గురువారం ధాత్రిహోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మఠం నిర్వాహకులు, పాలూరి క్రిష్ణ మూర్తి ఆధ్వర్యంలో పండితులు దంపతులచే ధాత్రి హోమాన్ని నిర్వహించారు. కార్తీక మాసంలో ఉసిరిచెట్టుకు పూజలు నిర్వహించి భోజనాలు నిర్వహిస్తే సకల దోషాలు నివారణ అవుతాయని పురాణాలు తెలుపుతున్నాయి. అనంతరం మహిళలు గోపూజ నిర్వహించారు.

సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న టీడీపీ నాయకులు

పరిగి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గ్రామాల అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా గురువారం గొరవనహళ్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాలనుంచి దళిత కాలనీ వరకు సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. కొన్ని సంవత్సరాల నుంచి వర్షాకాలంలో విద్యార్థులు ఈ దారిలో బడికి వెళ్లేందుకు బురద కారణంగా ఇబ్బందులు పడుతున్నారు. బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత ఇచ్చిన హామీ మేరకు గ్రామంలో సీసీరోడ్డు వేయడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌అరుణ, అంజికె. సంజీవరాయప్ప, మాజీ సర్పంచ్ అశ్వర్థప్ప, దేవరాజు, పూల సంజీవ, మల్లికార్జున, నరసింహులు, శ్రీరాములు, డి. అంజి, తిప్పన్న, గంగప్ప, అరుణ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులతో చెలగాటం ఆడితే కఠిన చర్యలు

పెనుకొండ టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కార్మికులకు అందించే ఆహార విషయంలో నాణ్యతలేని వస్తువులు వినియోగించి వారిప్రాణాలతో చెలగాటం ఆడితే చర్యలు కఠినంగా ఉంటాయని ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారి తస్లీం పేర్కొన్నారు. పెనుకొండలోని కియా కార్లపరిశ్రమలోని కార్మికులకు భోజనం సరఫరాచేసే క్యాంటీన్‌ను గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీచేశారు. ధనాస్, ఎస్ఎస్ఎస్ క్యాంటీన్‌లను పరిశీలించారు. ఈ క్రమంలో ధనాస్‌లో ఎక్స్‌పైర్ అయిన వాంగిబాత్ పౌడర్, కుళ్లిన పుట్టగొడుగులు, మ్యాంగోపౌడర్‌ను గుర్తించామని వారిపై కేసు నమోదుచేసి చర్యలకు జేసీ కోర్టుకు పెడుతున్నట్లు తెలిపారు. అలాగే ఎస్ఎస్ఎస్‌లో ఈగలు అధికంగా ఉన్నాయని వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పెనుకొండ ప్రాంతంలో అధికంగా బేకరీలు, హోటళ్లు ఉన్నాయని వాటిని తనిఖీచేసి చర్యలు తీసుకుంటామన్నారు.

రేపు మెగా జాబ్‌మేళా

హిందూపురం, నవంబరు14(ఆంధ్రజ్యోతి):హిందూపురం పట్టణంలోని బాలాజీ డిగ్రీ కళాశాలలో శనివారం మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వీరభద్రప్ప తెలిపారు. సుమారు 50 ప్రముఖ కంపెనీల వారు దాదాపు 15వేల ఉద్యోగాల కోసం ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నారన్నారు. ఉదయం 9గంటల నుంచి ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. ఫ్లిప్‌కార్ట్, అమెజాన్, ఎన్‌ఫీల్డ్, టీవీఎస్, వేర్‌హౌస్ కంపెనీలు యాక్సిస్‌బ్యాంక్ ఐటీ, నాన్ ఐటీ కంపెనీలు ఇందులో పాల్గొంటాయన్నారు. 10వ తరగతి నుంచి ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, బీటెక్ పాసైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ జాబ్‌మేళాకు 8019278756, 9581685417 నెంబర్లను సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు.

నేడు పెనుకొండలో..

పెనుకొండ, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): స్థానిక పరిటాల శ్రీరాములు డిగ్రీకళాశాలలో శుక్రవారం మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు వైస్ ప్రిన్సిపాల్ జయప్ప, నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారి హరిక్రిష్ణ ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్‌మేళాకు మూడు కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ,డిప్లమో పూర్తిచేసిన 18నుంచి 30సంవత్సరాలలోపు యువతీ యువకులు అర్హులన్నారు.

చేపలు పట్టేందుకు వెళ్లి వ్యక్తి మృతి



గోపాలప్ప (ఫైల్)

పెనుకొండరూరల్, నవంబరు14(ఆంధ్ర జ్యోతి): మండలంలోని నాగలూరులో చేపలుపట్టేందుకు వెళ్లి నీటమునిగి చోళసముద్రం గోపాలప్ప(45)అనే వ్యక్తి మృతిచెందాడు. నాగలూరు గ్రామానికి చెందిన గోవిందప్ప బుధవారం సాయంత్రం చేపలు పట్టేందుకువెళ్లాడు. చెరువు కట్ట కింద కాలువకు వస్తున్న నీటిలో గేలం వేసే క్రమంలో మద్యం మత్తులో కాలుజారి నీట మునిగి మృతిచెందాడు. ఈ క్రమంలో ఎంతసేపటికీ రాకపోవడంతో కుటుంబ సభ్యులు గురువారం ఉదయం చెరువు వద్దకు వెళ్లి చూడగా కాలువలో గోపాలప్ప శవమై కనిపించాడు. దీంతో స్థానికులు, గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని మృత దేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని భార్య సర్పంచ్ సునందమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

నేరాల నివారణపై విద్యార్థులకు అవగాహన

పెనుకొండ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): నేరాల నివారణపై పోలీసులు విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. గురువారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ రాఘవన్, ఎస్ఐ వెంకటేశులు, విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ చిన్న పిల్లలు, మహిళలపై జరిగే నేరాల గురించి, సైబర్ క్రైం గురించి, గంజాయి దానివల్ల కలిగే నష్టాల గురించి, రోడ్‌సేఫ్టీ, డయల్ 100, వంటి విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

రేపు కలెక్టరేట్ ముట్టడి

హిందూపురం అర్బన్, నవంబరు14(ఆంధ్రజ్యోతి): ఈనెల 16న అంగనవాడీలు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు ప్రాజెక్ట్ అధ్యక్షురాలు శోభారాణి, కార్యదర్శి లావణ్య, పేర్కొన్నారు.

అన్ని అర్హతలున్నా అందని పింఛన్



గౌరమ్మ

సాంకేతిక కారణాలంటూ సాకులు



నరసమ్మ, హరేసముద్రం

మడకశిర రూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందించే పింఛన్ తీసుకోవడానికి వారికి అన్ని అర్హతలున్నాయి. అయినా సక్రమంగా పింఛన్ అందకపోవడంతో ఏళ్లతరబడి కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మండలంలో హరేసముద్రం గ్రామానికి చెందిన నరసమ్మ భర్త కదిరప్ప 2021లో మృతిచెందారు. కుటుంబానికి ఆధారమైన భర్త మృతి చెందడం వల్ల ఆమెకు కుటుంబ పోషణ కష్టంగా మారింది. ఆమెకు ముగ్గురు కుమారైలు ఉన్నారు. ఆస్తులు, భూములు లేవు. కుటుంబ పోషణ క ష్టంగా మారింది. ప్రభుత్వం ఇచ్చే వితంతు పింఛన్ అయినా వస్తుందన్న ఆశతో 2021 లోనే దరఖాస్తు చేసుకొన్నారు. అందుకు ఆమె అర్హురాలైనప్పటికీ సాంకేతిక కారణాలతో నాలుగేళ్లుగా పింఛన్ మంజూరుకాలేదు. దీంతో ఆమె కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉంది. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు తగు చర్యలు తీసు కొని తనకు వితంతు పింఛన్ ఇప్పించి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతోంది.

ఇది ఇలా ఉండగా, తనకు ఒంటరి మహిళ కింద పింఛన్ వస్తుండగా, కావాలనే అధికారులు పింఛన్ తొలగించారని ఆవేదన వ్యక్తం చేస్తోంది గౌరమ్మ అనే మహిళ. ఆమె భర్త 15 ఏళ్ల క్రితం ఎక్కడికో వెళ్ళిపోయాడు. ఇప్పటి వరకు మళ్ళీ తిరిగిరాలేదు. ఆమెకు నా అనేవారు ఎవ్వరూ లేరు. 2018 నుంచి ఒంటరి మహిళగా పింఛన్ పొందుతోంది. ఇంతలో ఏమైందో ఏమోగాని అధికారులు 2023లో రేషన్ కార్డులో ఆమె భర్త పేరు ఉందనే సాంకేతిక కారణం చూపించి ఆమెకు వస్తున్న పింఛన్ తొలగించారు. దీనిపై గౌరమ్మ మాట్లాడుతూ, 2018లోనే తనకు ప్రభుత్వం వారు ఒంటరి మహిళ సర్టిఫికేట్ కూడా ఇచ్చారని, అయినప్పటికీ వస్తున్న పింఛన్‌ను తొలగించారని ఆవేదన వ్యక్తంచేస్తోంది. సంబంధిత అధికారులు తమ కుటుంబ పరిస్థితులను పరిశీలించి మళ్ళీ తనకు ఒంటరి మహిళ పింఛన్ మంజూరుచేయాలని కోరుతోంది.

సాంకేతిక కారణాలతోనే...

నరసమ్మ పేరు ఉమ్మడి కుటుంబంలోని రేషన్ కార్డులో ఉంది. ఆ కార్డులో మరొకరికి పింఛన్ వస్తోంది. దీంతో నరసమ్మకు పింఛన్ ఇవ్వలేకపోతున్నాం. ఆమెకు మరో రేషన్ కార్డు జారీచేయడానికి ఆప్షన్ ఇంత వరకు రాలేదు. అదే విధంగా గౌరమ్మ భర్తలేకపోయినప్పటికీ రేషన్ కార్డులో భర్త పేరు ఉంది. దీంతో ఆమెకు వస్తున్న ఒంటరిమహిళ పింఛన్ రద్దు అయింది. దీనిపై పై అధికారులకు తెలియజేశాం. ఆదేశాలు వచ్చిన వెంటనే వారికి పింఛన్ ఇస్తాం.

- సోనియాబాయి, ఎంపీడీఓ, మడకశిర

రైతులను కష్టాల్లోకి నెట్టిన జగన్

● ఎమ్మెల్యే ఎంఎస్ రాజు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు

మడకశిరటౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పట్టు, మల్బరీ, వక్క రైతులకు గత వైసీపీ ప్రభుత్వంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రోత్సాహకాలను రద్దుచేసి కష్టాల్లోకి నెట్టారని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు అన్నారు. గురువారం ప్రశ్నోత్తరాల సమయంలో పట్టురైతులు, వక్కరైతుల సమస్యలను సభ దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రంలో 1.50లక్షల ఎకరాల్లో మల్బరీ సాగు చేస్తున్నారని, ఒక్క మడకశిర నియోజకవర్గంలోనే 20 వేల ఎకరాల్లో మల్బరీ సాగు చేస్తున్నారని అన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో మల్బరీ రైతులకు అందిస్తున్న ప్రోత్సాహకాలను పూర్తిగా రద్దు చేశారని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. వైసీపీ అధినేత జగన్ హిందూపురం పర్యటన సందర్భంగా బకాయిలను రద్దుచేస్తామని హామీ ఇచ్చి గాలికి వదిలేశారన్నారు. మల్బరీ సాగుకు సంబంధించి డ్రిప్, స్ప్రింక్లర్లు ఇవ్వకుండా కొత్తగా పంట సాగుచేయడానికి ఆస్కారం లేకుండా చేశారన్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చిందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మడకశిర పర్యటన సందర్భంగా నేరుగా రైతులతో చంద్రబాబు మాట్లాడారని, ఈసందర్భంగా వక్క రైతులకు మార్కెట్ సౌకర్యం ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడంతోపాటు ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అదేవిధంగా రూ.10కోట్ల బకాయిలు రద్దుచేసి రీలర్లను ఆదుకోవాలని కోరారు. అందుకు మంత్రి అచ్చన్నాయుడు సానుకూలంగా స్పందించారు. ఇప్పటికే వక్క మార్కెట్ ఏర్పాటుకు సంబంధించిన ఫైల్ సిద్ధం అయ్యిందని, మడకశిర నియోజకవర్గంలో వక్క మార్కెట్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు.

ఉత్సాహంగా బాలల పండుగ

జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా బాలల దినోత్సవాన్ని హిందూపురం, మడకశిర డివిజన్‌లలో గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలుచోట్ల నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. పాఠశాలల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను పంపిణీ చేశారు. హిందూపురం ప్రేమసదన్‌లో జరిగిన బాలల దినోత్సవ వేడుకలో జిల్లా అదనపు న్యాయాధికారి కంపల్లె శైలజ మాట్లాడుతూ, రాబోయే భవిష్యత్తు బాలలదేనన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రమశిక్షణ నేర్చుకోవాలన్నారు. మంచి నడవడికతో ముందుకెళ్లి భవిష్యత్తులో ఉన్నతస్థాయికి చేరుకునేలా ప్రయత్నించాలన్నారు. చదువులో సంపాదించే మార్కులకంటే నడవడికలో, సత్ప్రవర్తనలో వచ్చే మార్కులే జీవితాన్ని పూలబాటగా మారుస్తాయన్నారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్



అమరాపురంలో..



అగళిలో..



పరిగిలో..



గుడిబండలో..



హిందూపురంలో..



గోరంట్లలో..

బీజేపీ బలోపేతానికి కృషిచేయాలి

పెనుకొండ రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బీజేపీ బలోపేతానికి కృషిచేయాలని తిరుపతి జిల్లా ఇన్‌చార్జి పీడీ పార్థసారథి, జిల్లా ప్రధాన కార్యదర్శి బూదిలి సుదర్శన్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి ఎనుమల రామక్రిష్ణ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి పార్టీ సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని పెనుకొండ సభ్యత్వ ఇన్‌చార్జ్ డా.గోపీనాథ్, కార్యవర్గ సభ్యుడు హనుమంత యాదవ్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రుణాల మంజూరు, రికవరీలో నిర్లక్ష్యం వద్దు

హిందూపురం, నవంబరు14(ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల సభ్యులకు ఇచ్చిన రుణాలను రికవరీ చేయడంలోనూ, ఇతర సభ్యులకు రుణాలు మంజూరు చేయడంలో అలసత్వం వహించకూడదని సిబ్బందికి ఐకేపీ పీడీ నరసయ్య సూచించారు. గురువారం స్థానిక ఐకేపీ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పీడీ మాట్లాడుతూ మొబైల్‌బుక్ కీపింగ్, సంఘాల గ్రేడింగ్‌పై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఎప్పటికప్పుడు సంఘాల పుస్తకాలు అప్‌డేట్ చేస్తుండాలన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఎం రామిరెడ్డి, రామ్మోహన్, పద్మావతి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను శుభ్రపరిచిన టీడీపీ నాయకుడు

గోరంట్ల, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఇటీవల వర్షాలకు ముళ్లపొదలు, పిచ్చి మొక్కలు పెరగడంతో టీడీపీ మైనార్టీ నాయకులు ఉమ్మర్‌ఖాన్ ఉచితంగా గురువారం శుభ్రం చేయించారు. పాఠశాల గదులు, మైదానం చుట్టూ ఏపుగా పెరిగిన మొక్కల కారణంగా విషకీటకాల బెడద అధికమైంది. విద్యార్థులకు ఇబ్బందులు రాకూడదని హెచ్‌ఎం గోపాల్, ఉపాధ్యాయుల అభ్యర్థన మేరకు సొంత ఖర్చుతో ఉమ్మర్‌ఖాన్ ఎక్స్‌కవేటర్ ద్వారా తొలగించి శుభ్రం చేశారు. దీంతో పాఠశాల సిబ్బంది ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

సంతోష్ ట్రోఫీకి జిల్లా క్రీడాకారుల ఎంపిక



సంతోష్ ట్రోఫీకి ఎంపికైన క్రీడాకారులు

హిందూపురం అర్బన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లా నుంచి జాతీయస్థాయి సంతోష్ ట్రోఫీ ఫుట్‌బాల్ పోటీలకు ముగ్గురు ఎంపికైనట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు జేవీ అనిల్‌కుమార్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనంతపురం ఆర్డీటీ క్రీడా మైదానంలో నేటినుంచి 19వరకు రాష్ట్రస్థాయి క్రీడలు జరుగనున్నాయి. ఈ టోర్నీలో డిఫెండర్‌గా పీఆర్ శివప్రసాద్, మిడ్ ఫీల్డర్‌గా మణికంఠ, స్ట్రయికర్‌గా ఎస్ ప్రవీణ్‌కుమార్ ఎంపికయ్యారు. ప్రతిభా క్రీడాకారులను ఫుట్‌బాల్ సంఘం జిల్లా కార్యదర్శి మహ్మద్ సలీం, కోశాధికారి శేఖర్, ఉపాధ్యక్షుడు ఇర్షాద్‌అలీ అభినందించారు.

చేపల వేలంతో రూ.51వేల ఆదాయం

లేపాక్షి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మైదుగోళం గ్రామ చెరువులో గురువారం పంచాయతీ కార్యదర్శి నాగరాజు ఆధ్వర్యంలో చేపల వేలంపాట నిర్వహించారు. పలువురు వేలంపాటలో పోటీ పడగా మైదుగోళం గ్రామానికి చెందిన రహమతుల్లా రూ.51వేలకు దక్కించుకున్నాడు. పంచాయతీకి రూ.51వేలు ఆదాయం వచ్చినట్లు కార్యదర్శి తెలిపారు.

చెరువులకు నీరివ్వాలి

మడకశిరటౌన్, నవంబరు14(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువ నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం సంతోషించదగ్గ విషయం అని, మడకశిర బ్రాంచి కెనాల్ ద్వారా మడకశిర, హిందూపురం, పెనుకొండ నియోజకవర్గాలలోని అన్ని చెరువులకు నీరు నింపాలని జలసాధన సమితి సభ్యులు సోమకుమార్ అన్నారు. శుక్రవారం మడకశిర తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతులు చేరుకొని తహసీల్దార్‌కు మెమోరాండం ద్వారా వినతి పత్రం అందించేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లి బ్రాంచి కెనాల్ మంజూరయ్యేలా అందరం కృషి చేద్దామని కోరారు. కావున అందరూ ఈనెల 15వతేదీ ఉదయం 11 గంటలకు తహసీల్దార్ కార్యాలయం వద్దకు రావాలని కోరారు.

ఘనంగా జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

మడకశిరటౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని స్థానిక గ్రంథాలయ కార్యాలయంలో గురువారం 57వ గ్రంథాలయ వారోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఎంఈఓ శ్రీనివాస భాస్కర్ పాల్గొని మాట్లాడుతూ గ్రంథాలయం ఓ విజ్ఞాన బాండాగారం అని విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు లభ్యమవుతాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈసందర్భంగా గ్రంథాలయ వారోత్సవ పోస్టర్‌లను విడుదల చేశారు. ఈకార్యక్రమంలో గ్రంథాలయ అధికారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

దంచికొట్టిన వాన



మడకశిరటౌన్, నవంబరు14(ఆంధ్రజ్యోతి): మడకశిరలో గురువారం సాయంత్రం 5.30 గంటల నుండి 7.30 గంటల వరకు భారీ వర్షం కురిసింది. ఉన్నఫలంగా గురువారం సాయంత్రం ఒక్కసారిగా మేఘాలు కమ్ముకొని వర్షం కురవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఈ వర్షాలతో చెక్‌డ్యాంలు, కుంటలు నీటితో కళకళలాడుతున్నాయి.

చెరువుగండికి మరమ్మతులు



చెరువు గండికి ఇసుక బస్తాలతో మరమ్మతులు

పావగడ, నవంబరు14(ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీ, తాలూకా పంచాయతీ అధికారులు అప్రమత్తంతో ముగుదాళబెట్ట గ్రామంలోని ఒక చెరువుకు గండిపడి వృథాగా పోతున్న నీటిని అరికట్టడంలో అధికారులు చొరవ తీసుకొని పనులు పూర్తిచేసి ప్రజల మన్ననలు పొందారు. గత రెండు రోజుల నుండి చెరువుకు గండిపడి వృథాగా పోతున్న నీటి విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ఈఓ జానకీరాం, తహసీల్దార్ వరదరాజు అధికారులను అప్రమత్తం చేసి తగిన చర్యలు తీసుకొని ఇసుక బస్తాలను గండికి అడ్డంగా వేసి నీటి వృథాను అరికట్టారు. గ్రామస్తుల మనవికి స్పందించిన అధికారులకు పీడీఓ పరమేష్, పంచాయతీ సభ్యులు నరసింహమూర్తి, ప్రమీళ, గోపాలప్ప, గ్రామస్థులు భాస్కర్, పాళేగారలోకేష్, తదితరులు కృతజ్ఞతలు తెలియజేశారు.

అసంక్రమిత వ్యాధులపై సర్వే ప్రారంభం

సోమందేపల్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): అసంక్రమిత వ్యాధులపై స్ర్కీనింగ్ కార్యక్రమాన్ని బుధవారం వైద్యాధికారులు ప్రారంభించారు. సోమందేపల్లిలోని సచివాలయం 1, 2లో, గుడిపల్లి, మాగేచెరువు, చల్లాపల్లి గ్రామాల్లో కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు నోడల్ ఆఫీసర్ కలాకర్ తెలిపారు. ఇందులో భాగంగా అసంక్రమిత వ్యాధులైన క్యాన్సర్, మధుమేహం, అధికరక్తపోటు, తదితర వ్యాధులజాబీ ఇంటింటి సర్వేద్వారా ప్రాథమిక దశలోనే గుర్తిస్తామన్నారు. ప్రతి రోజూ ఐదు గృహాలను సందర్శించి క్యాన్సర్, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భకోశ ముఖద్వారం క్యాన్సర్, తదితర వివరాలను సేకరిస్తామన్నారు. అనంతరం వారికి ఉచితంగా చికిత్సను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ హరికుమార్, పర్యవేక్షకులు, రవీంద్ర, రత్నమ్మ, ఎఎన్ఎంలు, శారద, రత్న, గంగమ్మ, రాజకళ, సరస్వతి, ఎంఎల్‌హెచ్‌పిలు పాల్గొన్నారు.

అయ్యప్ప దేవాలయంలో విశేష పూజలు



విశేష పూజల్లో పాల్గొన్న భక్తాదులు

సోమందేపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : హరిహర అయ్యప్పస్వామి దేవాలయంలో గురువారం విశేష పూజలు జరిగాయి. ఆలయంలో విగ్రహప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా కలశపూజ, కుంకుమార్చన, మహామంగళహారతి, దూపదీప నైవేద్యాలను సమర్పించారు. అనంతరం హోమాది కార్యక్రమాలను నిర్వహించారు.

ఘనంగా కాశీ విశ్వేశ్వరస్వామి నగరోత్సవం

పెనుకొండ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) : స్థానిక కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం లక్షదీపారాధన, గిరిజా కళ్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా గురువారం ఆలయంలో అర్చకులు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. సాయంత్రం వెండి రథంపై స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి విద్యుత్ దీపాలంకరణలతో మంగళవాయిద్యాలతో కోలాటం, చక్కభజన, బాణ సంచా పేల్చుతూ పురవీధుల్లో ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికి పుస్తక పఠనం అవసరం

గోరంట్ల, నవంబరు14 (ఆంధ్రజ్యోతి) : పాఠ్యపుస్తకాలతోపాటు గ్రంథాలయంలోని పుస్తకాలు, పత్రికలు చదడం వద్వారా విజ్ఞానం లభిస్తుందని వక్తలు పేర్కొన్నారు. గురువారం గోరంట్లలోని గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు.